


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA

RNI No: TELTEL/2024/86684



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 06.08.2025 | సంపుటి : 2 | సంచిక :184 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Wednesday | 06.08.2025 | volume : 2 | Issue : 184 | Pages : 8 | Cost : 2/- |






10

వీసాలపై అమెరికా

## మరో బాంబ్..

15,000 డాలర్లు కట్టాల్సిందే..



10

వాణిజ్య భాగస్వాముల

## ఎంపిక మా హక్కు

ట్రంప్‌కు రష్యా స్ట్రాంగ్ కౌంటర్



# ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు

- నలుగురు మృతి
- రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు
- ప్రధాని, హెూంమంత్రి స్పందన

03

# ఈవీఎంలపై విశ్వసనీయత పోయింది




- బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి
- బీహార్‌తో దీనిని ప్రారంభించండి
- కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్ఎస్ డిమాండ్

02

భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు.



10

## 'వాళ్లంతా స్వర్గానికే..'

వరద బాధితులతో మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



10

'రాహుల్ వ్యాఖ్యలు సరైనవే..'

ఇండియా కూటమి పార్టీల నేతలు



# పెరగనున్న యూరియా వినియోగం

## మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

## తక్షణం విడుదల చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, ఆగస్ట్ 5 :

రాష్ట్రంలో ఆగస్టులో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు.

02



03

## మరిన్ని సుంకాలు పెంచుతాం

భారత్‌కు ట్రంప్ హెచ్చరిక



02

## బండి సంజయ్‌కు సిట్ నోటీసులు

8న విచారణకు రావాలని ఆదేశం



ఆరు లైన్ల రహదారిగా

## విజయవాడ హైవే

- కేంద్రమంత్రి గడ్కరిని కలిసి కోరిన మంత్రి
- తమ్ముడికి మంత్రిపదవి ఇప్పించే స్థాయి కాదన్న కోమటిరెడ్డి

02

తెలంగాణ స్థానికతపై

# సుప్రీంలో విచారణ

- రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



03

న్యూఢిల్లీ, ఆగస్టు 5 :

తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ ముగిసంది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.

కాళేశ్వరంపై సిబిఐ విచారణను

## పట్టించుకోని కాంగ్రెస్

బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు

03

# బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు.



03



## ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

- చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

02

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడతాం
- తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన మాజీ మంత్రి హరీష్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి, రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు దండుకోవడానికి, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికి ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడారు.

03



# పెరగనున్న యూరియా వినియోగం

- మరో 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం
- తక్షణం విడుదల చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ



**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** రాష్ట్రంలో ఆగస్టులో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటుగా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థల నుండి 11,000 మెట్రిక్ టన్నులు, ఇతరత్రా 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు- పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పినందువల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను భర్తీ చేయాలని అన్నారు. ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని అన్నారు. దాంతో పాటు- ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరియా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## ఉపాధి హామీకి నిధులు పెంచాలి

### కేంద్ర సహాయ మంత్రికి సీతక్క వినతి

**హైదరాబాద్:** తెలంగాణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కోరారు. దిల్లీలో మంగళవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. "రాష్ట్రానికి 2024-25లో కేంద్రం 12 కోట్ల పనిదినాలు మంజూరు చేసింది. 2025-26లో కేవలం 6.5 కోట్ల పనిదినాలనే మంజూరు చేయడంతో ఇబ్బందికరంగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ ఎలాంటి ఆంక్షలు లేకుండా 12 కోట్ల పనిదినాలను కేటాయించి నిధులను పెంచాలి" అని సీతక్క విన్నవించారు.

## నగరంలో మరోమారు భారీ వర్షం

### బంజారాహిల్స్, కూకట్‌పల్లిలో కుంగిన రోడ్లు

**హైదరాబాద్, ఆగస్టు 5 :** హైదరాబాద్ నగరంలో పలు చోట్ల మరోమారు భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్ లో రోడ్డు కుంగింది. అకస్మాత్తుగా రోడ్డు కుంగడంతో అటుగా వస్తున్న నీటి ట్యాంకర్ అందులో పడిపోయింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌తోపాటు- క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగానే రోడ్డు కుంగినట్లు అధికారులు చెబుతున్నారు. కుంగిన చోట రోడ్డు కింద నాలా పైప్‌లైన్ ఉన్నట్లు- గుర్తించారు. రహదారి కుంగడంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాన్ని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ముస్లిం గ్రేవ్ యార్డ్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌తో పాటు రోడ్డు కుంగింది. దీంతో రహదారిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అదే రహదారిపై ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఫలితంగా స్టేషన్ నుంచి వై జంక్షన్ వరకు మురుగు నీరు ప్రవహిస్తోంది.

## కాశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు

### కుప్వారాలో ఉగ్రస్థావరం గుర్తింపు

### భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

**శ్రీనగర్, ఆగస్ట్ 5 :** జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ముమ్మరంగా ఆపరేషన్లు చేపడుతున్నాయి. తాజాగా కుప్వారాలో ప్రాంతంలో ఉగ్ర స్థావరాన్ని గుర్తించారు. దీనిలో పెద్దసంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌కు నాగ్ని టాప్ అని పేరుపెట్టారు. పక్కా సమాచారం మేరకు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, బీఎస్‌ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇక్కడ ఒక తుపాకీ, 12 గ్రనేడ్లు, రెండు మ్యాగ్జైన్‌లు, ఇతర పేలుడు పదర్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే కుల్గాంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ అఖాల్‌లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. మంగళవారం ఐదో రోజు కూడా ఇది కొనసాగుతోంది. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం నరమేధానికి పాల్పడిన ఉగ్రమూకను మట్టు-పెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ సైనిక చర్యలు చోటు-చేసుకోవడం గమనార్హం. జులై 30వ తేదీన ఆపరేషన్ శివ్‌శక్తిలో ఇద్దరు చొరబాటు- దారులను భద్రతా దళాలు హతమార్చాయి. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ఆయుధ డంప్ దొరకడం గమనార్హం.

## పిల్లలను అమ్మే గ్యాంగులతో నమ్రతకు లింక్

### నమ్రత పోలీస్ కస్టడీలో పలు విషయాలు వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** సృష్టి అక్రమ సరోగసీ, ఐవీఎఫ్ శిశువుల కొనుగోలు కేసులో అరెస్టయిన డాక్టర్ నమ్రత ఐదు రోజుల కస్టడీలో పోలీసులు కీలక విషయాలను రాబట్టారు. పిల్లల్ని అమ్మే గ్యాంగులతో కూడా డాక్టర్ నమ్రతకు సంబంధాలు ఉన్నట్లు- విచారణలో తేలింది. మహారాష్ట్ర, అహ్మదాబాద్, ఆంధ్రాకు చెందిన పిల్లల్ని కిడ్నాప్ చేసే ముఠాలతో నమ్రతకు లింకులు ఉన్నాయి. పిల్లల్ని కొని అమ్ముతున్న నందిని, హర్ష, పవన్‌లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. గతంలోనూ పిల్లల్ని అమ్ముతూ నందిని ,హర్ష, పవన్ అరెస్ట్ కావడం గమనార్హం. ఒక్కొక్క పిల్లాడిని 3 నుంచి 5 లక్షల రూపాయలు ఇచ్చి డాక్టర్ నమ్రత కొనుగోలు చేసినట్లు- తెలిసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగసీ వైపు మళ్లించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు- కస్టడీలో నమ్రత నిజం బయటపెట్టింది. నందిని, హర్ష, పవన్.. కలిసి కొన్ని ఏళ్ల నుంచి పిల్లల్ని అమ్ముతున్న గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. హైదరాబాద్‌లో మరొక నాలుగు సెంటర్లకు కూడా పిల్లల్ని అమ్మినట్టు పోలీసులు గుర్తించారు. పెట్టీ-కేర్, హెడ్జ్ ,ఒయాసిస్, సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్లకు పిల్లలను అమ్మినట్లు- విచారణలో తేలింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న పలు ఫెర్టిలిటీ- సెంటర్లతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయి. పిల్లల అమ్మకాలతో పాటు యువతి, యువకులను ఈ గ్యాంగ్ ట్రాప్ చేసింది. యువతి, యువకుల వీర్యకణాలు, అండాలను సేకరించి అమ్ముకుంది. డాక్టర్ నమ్రత పెద్ద ఎత్తున ఈ గ్యాంగ్‌కు డబ్బులు ముట్ట జెప్పినట్లు- కస్టడీలో బయటపడింది. డాక్టర్ సదానందం సృష్టి కేసులో కీలక పాత్ర పోషించినట్లు- కూడా వెల్లడైంది. గాంధీ ఆసుపత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా సదానందం కొనసాగుతున్నాడు. ప్రతి ఆపరేషన్ వెనుక సదానందం పాత్ర ఉన్నట్లు- పోలీసులు గుర్తించారు.

## బిజెపి వైపు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల చూపు

### త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీకి చెందిన పది మంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్టు- సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో చిక్కిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి కూడా పార్టీలో బీజేపీలో చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కీలక నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్టు- సమాచారం. ఈ నెల 9న నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో బీజేపీ కీలక నేతల బీఎల్ సంతోష్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొనేందుకు రెడీ అయిపోయారని సమాచారం. వీరిలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఉన్నట్టు- తెలుస్తోంది. రెండో దఫాలో మరో ఆరుగురు బీజేపీలో చేరుతారని సమాచారం. అయితే బీజేపీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో పాల్గొన్న నేతలంతా బీఎల్ సంతోష్‌తో మంతనాలు సాగించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేతో పాటు- మరో ఇద్దరు కీలక నేతలు కారు దిగుతారని సమాచారం.

## సినీ కార్మికుల సమ్మె

### చిరంజీవితో పలువురు నిర్మాతల భేటీ

**హైదరాబాద్,ఆగస్ట్ 5 :** సినీ కార్మికుల వేతన పెంపుపై టాలీవుడ్‌లో కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌ల మధ్య సఖ్యత కుదరడం లేదు. దీంతో ప్రముఖ నటుడు చిరంజీవితో పలువురు నిర్మాతలు మంగళవారం ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఆ వివరాలను నిర్మాత సి. కల్యాణ్ మీడియాకు వెల్లడించారు. నిర్మాతల నిర్ణయాన్ని చిరంజీవి అడిగి తెలుసుకున్నారు. యూనియన్ నాయకుల వాదన కూడా వినాలన్నారు. మూడు రోజుల్లో ఇరు వర్గాలు సామరస్యంగా చర్చించుకోవాలని సూచించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తాను జోక్యం చేసుకుంటానని తెలిపారు అని వివరించారు. చిరంజీవిని కలిసిన వారిలో అల్లు అరవింద్, సురేశ్‌బాబు, కె.ఎల్. నారాయణ, రవిశంకర్, ఫిల్మ్ ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ తదితరులున్నారు.

## ఈవీఎంలపై విశ్వసనీయత పోయింది

- బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి
- బీహార్‌తో దీనిని ప్రారంభించండి
- కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్ఎస్ డిమాండ్




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ నేతల బృందం కేటీఆర్ నేతృత్వంలో ఈసీ అధికారులతో సమావేశం అయింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ, నూతన సంస్కరణలు, ఎన్నికల నియమావళి వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే బిఆర్ఎస్ పార్టీని సమావేశానికి ఆహ్వానించింది. కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ బృందం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసింది.. భారత్ లో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికల పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో, ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు- కేటీ-ఆర్ తెలిపారు. అంతేకాదు ఎన్నికలు వస్తే చాలు రాజకీయ పార్టీలు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోతే చర్యలు కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బిఆర్ఎస్ కోరింది. మరోపక్క బీహార్ లో జరిగిన ఓట్ల జాబితా సమగ్ర సర్వేపై కూడా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించినట్టు- తెలిపారు. ముఖ్యంగా ఓట్లు- తొలగించేటటువంటి ప్రక్రియను బూత్ స్థాయి నుంచి అన్ని రాజకీయ పార్టీలను అఖిలపక్షంగా ఏర్పాటు- చేసి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనర్హుడికి ఒక ఓటు- వచ్చినా సరే, ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు- కోల్పో వద్దన్నారు కేటీ-ఆర్. ఎన్నికల గుర్తులు నుంచి తమ పార్టీ సింబల్ అయిన కార్ గుర్తును పోలి ఉన్న గుర్తులను తక్షణమే తొలగించాలని.. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో పోలివున్న గుర్తులవల్ల తమ పార్టీ అభ్యర్థులు నష్టపోయారని కేటీఆర్ గుర్తు చేశారు..

## నాగారం భూదాన్ భూములపై విచారణ

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** నాగారంలోని భూదాన్ భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని పిటిషనర్ రాములు కోర్టుకు తెలిపారు. కానిస్టేబుల్ కోర్టు ముందు హాజరుకావాలని న్యాయమూర్తి గత విచారణ సందర్భంగా ఆదేశించారు. దీంతో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మంగళవారం న్యాయమూర్తి ఎదుట విచారణ హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు పిటిషనర్‌కు ఫోన్ చేశానని కానిస్టేబుల్ కోర్టుకు తెలిపారు. విలేజ్ హిస్టరీ రికార్డులో వివరాల నమోదు కోసం రాములుకు ఫోన్ చేసినట్టు- పేర్కొన్నారు. విత్‌డ్రా చేసుకోవాలని పిటిషనర్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదులు మరోసారి రావొద్దని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరొకరు బలి

### అప్పులు చేసి తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థికంగా నష్టపోయిన నరేశ్.. సుమారు రూ. 15లక్షలు అప్పు చేసినట్లు సమాచారం. ఇటీవల అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న నరేశ్.. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కాళేశ్వరం నివేదికలో మొత్తం ట్రాష్

- లీకులు ఇచ్చి వార్తలు రాయించుకుంటున్నారు
- అసెంబ్లీలో చర్చ పెడితే ఎండగడతాం: కెటిఆర్

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్ మాత్రమే తప్ప అందులో ఏమీ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. 650 పేజీల పూర్తి నివేదిక ఎవరూ చదవక ముందే అడ్డమైన రోత వార్తలను రెండు పత్రికలు రాస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 655 పేజీల కమిషన్ నివేదికను 60 పేజీలకు కుదించడంలోనే కాంగ్రెస్ భాగోతం అర్థమైందని విమర్శించారు. 600 పేజీల్లో వారికి ఇష్టమైనవి లేవు అని, ఆ 60 పేజీల్లో మాత్రమే వారికి ఇష్టమైనవి ఉన్నాయని, అందుకే వాటిని మాత్రమే బయటపెడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమావేశానికి కెటిఆర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హాజరైంది. ఈ సమావేశంలో కెటిఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు కె.ఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్ పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీలో కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం నివేదికపై ప్రశ్నకు సమాధాన ఇస్తూ.. సాయంత్రం కమిషన్ రిపోర్ట్ వస్తే అర్ధరాత్రి ఆస్థాన మీడియాకు లీకులు ఇచ్చారని, తెల్లారి అబద్దాలను ప్రచారంలో పెట్టారని మండిపడ్డారు. దమ్ముంటే మొత్తం 655 పేజీల నివేదికను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగా కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుందని, అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా తమను అసెంబ్లీలో మాట్లాడనిస్తే ప్రభుత్వంతో ఫుట్‌బాల్ ఆడుకుంటామని అన్నారు. అసెంబ్లీలో తమ మైకులు కట్ చేయకుండా తమను మాట్లాడిస్తే ఎవరు నిజం చెబుతున్నారు... ఎవరు అబద్ధం చెపుతున్నారో తెలిసిపోతుందని, కాంగ్రెస్ పార్టీకి దమ్ముందా.. అంటూ కెటిఆర్ సవాల్ విసిరారు.



## బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు

### 8న విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 5 :** తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు- తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టే-టె-÷-మంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీ-సులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్ కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.



## ఆరు లైన్ల రహదారిగా విజయవాడ హైవే

- కేంద్రమంత్రి గడ్కరిని కలిసి కోరిన మంత్రి
- తమ్ముడికి మంత్రిపదవి ఇప్పించే స్థాయి కాదన్న కోమటిరెడ్డి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 5 :** మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు- సర్వీస్ రోడ్లను నిర్మించాలని కేంద్ర గడ్కరీని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికోరారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశ మయ్యారు. వచ్చే వారం ప్రధాన మంత్రితో సమావేశం అవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించారు. మంత్రితోపాటు తెలంగాణ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం గురించి ప్రయత్నాలు చేస్తున్నాం.. ప్లాన్స్ జరుగుతున్నాయన్నారు. పటౌడీ హౌస్ లో రెండు నెలల్లో పనులు మొదలు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో అనుమతుల కోసం కొంత ఆలస్యం అవుతోందన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్ పై మంత్రి స్పందించారు. నేను మా సోదరుడికి మంత్రి పదవి ఇప్పించే స్టేజ్ లో లేను. కేంద్ర పెద్దలు మాటిచ్చిన విషయం నాకు తెలియదు. నా చేతుల్లో ఏం లేదు. అధిష్టానం, ముఖ్యమంత్రి మంత్రి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఢిల్లీకి రాలేదు. మంత్రి పదవి అడగలేదు అని స్పష్టం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల 30శాతం వేతన పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మె వివాదంపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు బాధ్యతలు అప్పగించినట్లు- ఆయన తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో బతకాలంటే జీతాలు పెరగాలి. ఢిల్లీ పర్యటన తర్వాత నేను కార్మికులతో నేరుగా మాట్లాడతాను. ఈ అంశాలన్నిటినీ దిల్ రాజుకు అప్పగించాము. ఆయన ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నారుని వెల్లడించారు. ఆయన మరింత మాట్లాడుతూ, 'పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నారు. టికెట్ ధరలు పెంచేందుకు మేము అనుమతులు ఇస్తున్నాము. కాబట్టి, కార్మికులు అడుగుతున్న డిమాండ్లపై చర్చించి, నిర్మాతలు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

## కొండగట్టులో భారీగా భక్తుల రాక

### అన్నదానం టోకెన్ల కోసం ఎగబడ్డ జనం

**జగిత్యాల, ఆగస్ట్ 5 :** అంజన్న పుణ్య క్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ కారణంగా అన్నదానం టోకెన్ల కోసం కొట్లాట జరిగింది. కొండగట్టు- ఆంజనేయ స్వామి సన్నిధికి భక్తులు మంగళవారం భారీగా తరలివెళ్లారు. మంగళవారం పైగా శ్రావణ మాసం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకొని అంజన్నకు మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సూపరిండెంట్లు- సునీల్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు- చేశారు. నిత్యం అన్నదానం చేసే సత్రం దగ్గర టోకెన్ల కోసం భక్తులు ఎక్కువ మంది రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. మంగళవారం కేవలం 200 మంది భక్తులకు అన్నదానం అవకాశం కల్పించడంతో సుమారు 300 పైగా భక్తులు చేరుకున్నారు. దీంతో టోకెన్ల జారీ చేసే దగ్గర స్వల్ప తోపులాట జరిగింది. అన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచాలని ఈ సందర్భంగా భక్తులు డిమాండ్ చేశారు. నిత్యం భక్తులతో కిటకిటకిటలాడే కొండగట్టు- అంజన్న ఆలయం ఆషాఢ మాసంలో భక్తులు లేక వెలవెల పోయింది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో అంజన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

## మేడిగడ్డకు సీడబ్ల్యూపీఆర్ఎస్ బృందం

**మహదేవపూర్ :** కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీని పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు చెందిన శాస్త్రవేత్తల బృందం మంగళవారం సందర్శించింది. బ్యారేజీ ఏడో బ్లాక్ దెబ్బతిన్న నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ, రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు బ్యారేజీలో పరీక్షలను చేపట్టనుంది. ఈ మేరకు శాస్త్రవేత్తలు ప్రసాద్ కుమ్జీర్, హర్షచౌదరి నేతృత్వంలో హైడ్రలాజికల్ నిపుణులు బ్యారేజీని పరిశీలించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద, నీటి లభ్యత, ప్రాణహిత, గోదావరి నుంచి వరద ప్రవాహం తదితర అంశాలపై వివరాలు సేకరించారు. బుధవారం అన్నారం బ్యారేజీని పరిశీలించనున్నట్లు వారు తెలిపారు.

## బావిలో దూకి కుటుంబం ఆత్మహత్య

**వికారాబాద్,ఆగస్టు 5 :** వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలో ఓ విషాదం చోటు-చేసుకుంది. చీమల్ దరి వద్ద అన్నా, చెల్లెలు బావిలో దూకి చనిపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చీమల్ దరి గ్రామంలోని ఓ వెంచర్‌లో దంపతులు పని చేస్తున్నారు. దంపతుల మధ్య జరిగిన గొడవ తారాస్థాయికి చేరుకుంది. భర్తతో గొడవపడిన భార్య అలివేలు మనస్థాపానికి చెంది బావిలో దూకింది. భార్యను రక్షించాలని వెంటనే భర్త మాసయ్య బావిలో దూకాడు. అన్న, వదినను మునిగిపోవటం చూసి వారిని రక్షించేందుకు చెల్లెలు నాగమ్మ బావిలో దూకింది. బావిలో పడిన ముగ్గురిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. మొదట బావిలో దూకిన భార్య అలివేలు పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాసయ్య, చెల్లెలు నాగమ్మ మృతి చెందారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

- కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడతాం
- తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్, ఆగస్టు 5 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి, రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు దండుకోవడానికి, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికి ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక నివేదిక, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు మరో నివేదిక, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకొక నివేదిక రావడం కుట్రలో భాగమేనన్నారు. మాకు నోటీసులు రాకముందే వీడియోకు లీకులు ఇచ్చారు. 60 పేజీల నివేదికను కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల నివేదికను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడతామని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పుపట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని నివేదిక ఇచ్చిందని, ఇది ట్రాష్, బేస్‌లెస్ అని తెలిపారు. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు విధిని ఎదుర్కొన్న నివేదికలు న్యాయస్థానాల్లో నిలవలేదన్నారు. ఇవి కూడా నిలవవని వ్యాఖ్యానించారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయినని స్పష్టంచేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారని, కానీ నిజం ఏమిటంటే సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలా పూజిస్తారన్నారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసని, అందుకే గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరి కాయ కొట్టారని తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించిందన్నారు. కాళేశ్వరం డీపీఆర్‌లో అన్నీ క్లియర్‌గా పేర్కొన్నామని, నీళ్ల లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించామని తెలిపారు. ఇది కేబినెట్ నిర్ణయం ప్రకారమే జరిగిందని, 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని సవాల్ విసిరారు. ధైర్యం ఉంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలని, ఆధారాలతో చర్చిస్తామని అన్నారు. “ఇప్పుడు కోడిగుడ్డు వేసి ఈకలు పీకుతున్నట్టు ఆరోపణలు చేస్తున్నారని, తెలిసి ఉంటే మేం మరిన్ని ఆధారాలు సేకరించేవాళ్లం” అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీష్ రావు ప్రజెంటేషన్‌ను పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకొని కాళేశ్వరం నిర్మించామని పేర్కొన్నారు. “ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా?” అని ప్రశ్నించారు. వాస్తవాలు ప్రజల ముందు పెట్టాలన్నదే తమ ఉద్దేశమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలన గాలికి వదిలేసి, రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. డబ్బులు దండుకునేందుకు, ప్రతిపక్షాలపై కక్ష సాధించేందుకు ఈ కమిషన్లను వాడుతున్నారని విమర్శించారు.

### కాంగ్రెస్, బీజేపీ కక్షసాధింపు చర్యలు

కాంగ్రెస్, బీజేపీ కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఏ నిఘా పంపలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదికను ఈ సమయంలో బయటపెట్టారని ఆరోపించారు. “కేసీఆర్, హరీష్ రావును కమిషన్ పిలవదని మొదట చెప్పారు. తరువాత రాత్రికి రాత్రే గడువు పొడిగించారు. పూర్తి నివేదికను బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే చీల్చి చెండాడతాం,” అన్నారు. “నచ్చిన పేరాలు లీకులు.. నచ్చని నాయకులను బాధ్యులుగా చూపించడం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్నే తప్పుబట్టినట్లవుతుంది. ఇది పూర్తిగా ఒక వైపే చూసిన, విన్న, నిలబడ్డ నివేదిక,” అన్నారు. “నివేదిక ఒక ట్రాష్.. ఆధారాల్లేని ఆరోపణల సమాహారం. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యతే. ఇది ఎలా రాజకీయ జోక్యం అవుతుంది? చరిత్రలో ఇలాంటి రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన నివేదికలు న్యాయస్థానాల్లో నిలవలేవు. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు” అని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద 152 భూస్వాములతో ఒప్పందం చేసుకున్నామంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారని తెలిపారు. “రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరానికి అయినా నీళ్లు ఇచ్చిందా? రెండేళ్లుగా ఢిల్లీకి కమిషన్లు మోసారు. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏదీ చేయలేదు. వచ్చే మూడేళ్లూ ఇదే జరుగుతుంది,” అన్నారు. “కాళేశ్వరం ప్రాజెక్టును పాడవు పెట్టి బనకచర్లకు నీళ్లు తరలించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారు. కానీ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని. ఇది రేవంత్ రెడ్డికి కూడా తెలుసు,” అని అన్నారు. “ఒకవైపు కాళేశ్వరం కూలిపోయిందంటారు, మరోవైపు గోదావరి నీటిని మూసీకి తీసుకెళతామని ఎలా చెబుతారు?” అని హరీష్ రావు ప్రశ్నించారు.



# బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

**ఖమ్మం,ఆగస్టు 5 :** కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ-, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు- జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# విద్యుత్ తీగ పడి యువరైతు దుర్మరణం

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 5 :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడు పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో వాహనంతో సహా దగ్ధమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందు గ్రామానికి చెందిన పర్సిక రాజు(35) అనే వ్యక్తి తన బైక్ వెళ్తుండగా గ్రామ శివారులో అతడిపై విద్యుత్ తీగ పడింది. బైక్ తో సహా అతడు కాలిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష నిమిత్తం గుండాల ప్రభుత్వాత్రికి తరలించారు. మంటల్లో కాలిపోతున్న యువకుడిని చూసి కుటు-ంబ సభ్యులు, బంధువుల బాధపడే తీరు అందరినీ కలిచి వేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియా వైరల్ గా మారింది.

# ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు

## ధరాలీ గ్రామంపై విరుచుకుపడిన జలప్రవాహం

- నలుగురు మృతి
- రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు
- ప్రధాని, హోంమంత్రి స్పందన



**డెహ్రాడూన్, ఆగస్టు 5 :** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో ఆకస్మిక వరదలు భయానక స్థితిని సృష్టించాయి. ధరాలీ గ్రామంపై మెరుపు వరద విరుచుకుపడటంతో, ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్టు సమాచారం. స్థానికుల వివరాల ప్రకారం, దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని, 20-25 హోటళ్లు, నివాస భవనాలు కొట్టుకుపోయినట్టు అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియా వేదికగా వైరల్ అయ్యాయి. ఉపరితల ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి భారీ వర్షాల కారణంగా మెరుపు వరదలు సంభవించినట్టు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల కోసం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలపై సీనియర్ అధికారులతో నిరంతర సమీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. “ధరాలీలో కుండపోత వర్షాల కారణంగా చోటు చేసుకున్న నష్టం బాధాకరం. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బాధితులకు అన్ని విధాల సహాయం అందించబడుతుంది,” అని సీఎం ధామి తెలిపారు. ఇదిలా ఉంటే, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సీఎం ధామికి ఫోన్ చేసి పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. కేంద్రం తరఫున అవసరమైన అన్ని సహాయాలను అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ విషయంలో స్పందించారు. ధరాలీ వరద ఘటనలో బాధిత కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. సీఎం ధామితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు. ప్రకృతి సోయగాలకు పేరుగాంచిన ధరాలీ గ్రామం ఈ వరదలతో తీవ్రంగా దెబ్బతింది. మేఘవర్షం కారణంగా నదీజలాలు మట్టి, బురదతో కలిసి భారీ ఎత్తున ప్రవహించాయి. దీంతో ధరాలీ మొత్తం మట్టిలో కప్పబడి, పాడైపోయిన ప్రాంతంలా మారిపోయింది. ఈ గ్రామం చార్‌ధామ్ యాత్రికుల ముఖ్యమైన కేంద్రంగా ఉంది. యాపిల్ తోటలతో ప్రసిద్ధిగాంచిన హర్సిల్ లోయ ఇక్కడికి కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. సముద్ర మట్టానికి సుమారు 2,680 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ ప్రాంతం నుంచి గంగోత్రి ధామ్ కేవలం 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. ధరాలీ గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి వెళ్లడం వల్ల యాత్రికులు ఎక్కువగా ఇక్కడ ఆగి విశ్రాంతి తీసుకుంటారు. ఇక్కడ అనేక లాడ్జీలు, అతిథిగృహాలు ఉండడం వల్ల తక్కువ ఖర్చుతో వసతి లభ్యమవుతుంది. నీలాంగ్ లోయ, భారత్-టిబెట్ వాణిజ్య మార్గం, హర్సిల్ వంటి ప్రాంతాలకి ఇది ప్రధాన ప్రదేశంగా నిలుస్తుంది. ఇదిలా ఉండగా, ఖీర్‌గఢ్ నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచి, ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రాంతంపై విరుచుకుపడింది. వాతావరణ శాఖ ఇప్పటికే ఆగస్టు 10వ తేదీ వరకు భారీ వర్షాల సూచన ఇచ్చింది. తాజాగా సంభవించిన మెరుపు వరదల్లో 20-25 హోటళ్లు, హోం స్టేలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

### క్లౌడ్ బరస్ట్ అంటే ఏమిటి?

అతి తక్కువ సమయంలో తీవ్రమైన వర్షపాతం నమోదయ్యే పరిస్థితిని క్లౌడ్ బరస్ట్ అంటారు. సాధారణంగా గంటలోపు 20-30 కిలోమీటర్ల పరిధిలో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైతే, దాన్ని క్లౌడ్ బరస్ట్‌గా పరిగణిస్తారు. 5 సెంటీమీటర్ల కంటే తక్కువ వర్షపాతాన్ని మినీ క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటారు. ఇలాంటి వర్షాలు ఎక్కువగా హిమాలయ పర్వత ప్రాంతాల్లో కనిపిస్తాయి. గతంలోనూ ఇటువంటి క్లౌడ్‌బరస్ట్‌లు భారీ ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమయ్యాయి.



# ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం

- చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**మేడ్చల్, ఆగస్టు 5 :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాటలతో కాకుండా పనుల చేసి తమది చేతల ప్రభుత్వమని చెబుతున్నామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నా మన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ-లు ఏర్పాటు- చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు- తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# మరిన్ని సుంకాలు పెంచుతాం

## భారత్‌కు ట్రంప్ హెచ్చరికలు


**వాషింగ్టన్, ఆగస్టు 5 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ట్రంప్ విధించిన 25 శాతం సుంకాల నిర్ణయం అమలులోకి వచ్చింది. 6వ తేదీ నుంచి భారతీయ సరుకులపై ఈ సుంకాల వసూళ్లు ఆరంభం అవుతాయి. అయితే మరోసారి ట్రంప్ సుంకాల పెంపు విషయంలో మరోసారి కఠిన నిర్ణయం తీసుకున్నారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. అమెరికాకు భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదని అన్నారు. అమెరికాతో భారత్ పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తుంది.. కానీ, అమెరికా మాత్రం భారత్‌తో వ్యాపారం చేయదని స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని.. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని ఆక్రోశాన్ని వెళ్లగక్కారు.

# తుపాకీ బుల్లెట్, గంజాయి స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 5 :** మీర్‌పేట్‌లోని ఓ ఇంట్లో తుపాకీ బుల్లెట్ కలకలం సృష్టించింది. ఓ యువకుడి దగ్గర బుల్లెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేట్‌లోని ఎస్ఎల్ఎన్ ఎస్ కాలనీలో చంద్రశేఖర్ అనే వ్యక్తి రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో దొంగతనం చేసి అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నాడు. పోలీసులు చంద్రశేఖర్ అరెస్ట్ చేసి బుల్లెట్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

- మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి
- 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు




**హైదరాబాద్, ఆగస్టు 5 :** పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పానని వెంకయ్యనాయుడు అన్నారు. భాష విషయంలో నాయకుల తీరు మారాలని వెంకయ్యనాయుడు సూచించారు. సీనియర్ సంపాదకులు ఐ.వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై సిబిఐ విచారణను

# పట్టించుకోని కాంగ్రెస్

## బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు



**పెద్దపల్లి, ఆగస్టు 5 :** కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోమని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాం చందర్ రావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెట్టిన తర్వాతే స్పందిస్తామని, కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానిదా.. కాంగ్రెస్‌దా అని చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి కాళేశ్వ రం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బిజెపి చెబుతుందన్నారు. సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తు న్నామన్నారు. కానీ దీనిపై కాంగ్రెస్ వెనకడుగు వేసిందన్నారు. నిజాయితీగా, చిత్తశుద్ధితో విచారణ జరగాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, బిసి జాబితాలో ముస్లింలను కలపొద్దని కాంగ్రెస్ ను కోరారు. కాంగ్రెస్ కు బిసిలపై ప్రేమ ఉంటే మహేశ్వర్ గౌడ్ ముఖ్యమంత్రిని చేయాలని రాంచందర్ రావు పలుమార్లు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

## సంపాదకీయం

# కన్నడనాట అత్యాచార కాండ!



ధర్మస్థలి....ప్రజ్వల్ రేవణ్ణ ఈ రెండు పేర్లు దేశానికి ఇప్పుడు బాగా తెలిసి పోయాయి. ముఖ్యంగా కర్నాటక ప్రజల నోళ్లల్లో నిత్యం నానుతున్న పేర్లుగా చెప్పుకోవాలి. రెండూ ఒకే తరహా కేసులుగా చూడొచ్చు. ధ్మస్థలిలో అమ్మాయిలపై అత్యాచారం చేసి చంపేస్తున్నారని, అదృశ్యం అయిన కేసుల్లో ఇప్పటికీ ఆచూకీ దక్కలేదని గుర్తించారు. అనేకమంది అమ్మాయిల మరణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. ఒకరిద్దరు మాత్రమే ఫిర్యాదు చేశారు. వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో నాటి బిజెపి ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా లేవు. అందుకే ప్రజల్లో ఉన్న సీరియస్ నెస్ ఇక్కడ కానరావడం లేదు. అందుకే దర్యాప్తు నత్తనడకన సాగిస్తున్నారు. సిట్‌ను వేసినా పెద్దగా ఉపయోగం లేదన్న చర్చ కూడా మొదలయ్యింది. ధర్మస్థలి వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నాయని, మాఫియా ఉందని అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండడంతోనే అసలు నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ఈ కుంభస్థలం ఎప్పుడో బద్దలు కాక తప్పదు. మాజీ సానిటేషన్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో కొంత కదలిక వచ్చినా, పాలకుల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి లోపించినా దర్యాప్తు ముందుకు సాగదు. ఇకపోతే ప్రజ్వల్ రేవణ్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడిగా, ఎంపిగా సాగించినా అత్యాచారకాండ అంతాఇంతా కాదు. దీనిపై చర్చించడం కూడా అవసరం. ఇలాంటి దగుల్బాజీల పాపం పండి జైలు శిక్ష పడింది. లేకపోతే మరింతగా విర్రవీగేవారు. ఎన్‌డిఎ కూటమి పార్టీ జెడిఎస్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులు నమోదైనప్పుడు కనీసమాత్రంగా కూడా నేతలు స్పందించలేదు. ప్రజల్వల్ తీర్పును స్వాగతించలేదు. న్యాయస్థానం శిక్ష విధించాక కూడా మోడీ నుంచి కాని, బిజెపి నుంచికాని ఎలాంటి స్పందన లేదంటే మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారికి మద్దతిచ్చినట్లుగా భావించాలి. ప్రజ్వల్‌పై ఒక కేసులోనే శిక్ష పడింది. మరిన్ని కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలోనూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితునికి శిక్ష పడేలా అన్ని వ్యవస్థలూ పని చేయాలి. రాజకీయ పలుకుబడి, డబ్బు ఉన్న ప్రజ్వల్ పైకోర్టులను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. తప్పించుకోకుండా పోలీసులు, బాధితులు అప్రమత్తంగా ఉండాలి. ఇకపోతే కేసు వివరాల్లోకి వెళితే..ప్రజ్వల్ రేవణ్ణ నిజంగానే ఓ దుర్మార్గుడు. ఎందరో మహిళల మానాలను దోచుకున్న దుండగుడు. అతనికి జీవితఖైదు విధించడం సరైనదే. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరాలి. ఇకపోతే రేవణ్ణ కేసులు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారం జరిపిన కేసులో అభియోగాలు రుజువు కావడంతో మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు ప్రజాప్రతినిధుల న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, యావజ్జీవంతోపాటు 11.35 లక్షల రూపాయలు జరిమానా విధించి, దానిలో 11 లక్షలు బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

మహిళలను కట్టుబానిసలుగా, వారిని సెక్స్ వర్కర్లుగా చూస్తున్న ప్రస్తుత సమయంలో న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు మహిళలకు ఆశాకిరణం. రోజురోజుకు స్త్రీలపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతున్న వేళ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిందనే చెప్పాలి. ప్రజ్వల్‌పై మూడు లైంగిక దాడి కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదుకాగా మొదటి కేసులోనే శిక్ష పడింది. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి. మైసూర్ ఆర్‌కె నగర్‌కు చెందిన ఒక మహిళ తనపై ఫాంహౌస్‌లో ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేయడంతో తొలికేసు నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండవ తడవ హసన్ నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. పోలింగ్ ముగిశాక కేసు నమోదు కావడంతో జర్మనీకి పారిపోయాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం అతన్ని స్వదేశానికి రప్పించి గతేడాది మే 31న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ప్రజ్వల్ జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. కేసు దర్యాప్తు సమయంలో సిట్ కనుగొన్న విషయాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ ప్రజాప్రతినిధిగా సమస్యలపై తన దగ్గరకొచ్చే మహిళలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బెదిరించో బలవంతంగానో లోబరుచుకునో లైంగిక దాడులకు బరితెగించాడు. అత్యాచారం చేసిన ప్రతిసారీ తన ఐ-ఫోన్‌లో ఆ దృశ్యాలను తానే రికార్డు చేసుకున్నాడు. అటువంటి రెండు వేలకు పైచిలుకు వీడియోల ను దర్యాప్తు సందర్భంగా ప్రజ్వల్ ఫోన్‌లో కనుగొన్నారు. అవి మార్ఫింగ్ వీడియోలుగా, రాజకీయ కుట్రగా ప్రజ్వల్ బుకాయించి తప్పించుకోచూశాడు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీడియోలను విదేశాలకు పంపి, ఫోరెన్సిక్ పరీక్షలు చేయించి నిజమైనవేనని నిర్ధారించారు. కేవలం 14 మాసాల్లోనే కేసు ఛేదించడం వెనుక దర్యాప్తు అధికారుల కృషి, కోర్టులో వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ కనబరిచిన చాకచక్యం అభినందించాల్సిందే.

ఇవన్నీ కలిసి ప్రజ్వల్‌ను బోనులో దోషిగా నిలబెట్టాయి. అన్నింటికీ మించినది న్యాయం కోసం, దోషికి శిక్ష పడాలని బాధితురాలు కనబర్చిన పట్టుదల మహిళాలోకానికి స్ఫూర్తినిస్తుంది. ప్రజ్వల్ రేవణ్ణ సాదాసీదా యువకుడు కాదు. కర్ణాటక రాజకీయాలను శాసిస్తున్న కుటుంబానికి చెందిన మాజీ ఎంపి. ఆయన తాత దేవెగౌడ మాజీ ప్రధాని, పినతండ్రి కుమార స్వామి కేంద్ర మంత్రి, తండ్రి మాజీ రాష్ట్ర మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌ఎ హెచ్‌డి రేవణ్ణ, తల్లి భవానీ గతంలో కార్పొరేటర్, సోదరుడు సూరజ్ ఎంఎల్‌ఎ. ఇంతమంది రాజకీయ కుటుంబంలో ఉన్న ప్రజల్వల్ తనకు తిరుగులేదని భావించాడు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ప్రజ్వల్ తల్లి భవానీపైనా కేసు , ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదయ్యాయంటే బాధితులను ప్రజ్వల్ కుటుంబం తమ రాజకీయ పలుకుబడితో ఏ స్థాయిలో భయభ్రాంతులకు గురి చేసిందో తెలుస్తుంది. అయితే పాపం పండింది. ప్రజ్వలు ఎంతగా మొత్తుకున్నా సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అత్యాచారాలు చేసి పైశాచికానందం పొంది, వాటిని సెల్ ఫోన్లలో వీడియోలు తీసి మురిసి పోయిన ప్రజ్వల్ లాంటి వారికి జీవిత ఖైదు సరిపోదు. అలాగే ధర్మస్థలిపైనా నిజాయితీగా విచారణ జరగాలి. అప్పుడే ప్రజల్లో భరోసా వస్తుంది. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దని చాటుకోవడానికి ఇదో మంచి అవకాశం. రాజ్యాంగం పుస్తకాన్నిపట్టుకు తిరుగుతున్న రాహుల్ ఈ విషయంలో తమ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధర్మస్థలి విషయంలోనూ నిగ్గు తేలేలా చేస్తే మంచిది.

# తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టులో విచారణ

- రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసు కోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి అన్నారు. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వి కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

# ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

- ముంబై తరవాత ప్రారంభానికి సిద్ధం
- 11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది. ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు- తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలు గల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ.50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

## తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభలో ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు కింద అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి పాలన పొడగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపి వేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు- స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ- మెయిటీ- కమ్యూనిటీ-, మైనారిటీ- కుకి-జోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో అక్కడ శాంతిభద్రతలను కాపాడేందుకు కేంద్రం రాష్ట్రపతి పాలనకు మొగ్గుచూపింది.

# రాజ్యసభలో సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది రాక

- అధికార పార్టీ తీరుపై మండిపడ్డ సభ్యులు
- గందరగోళం మధ్య తొలుత వాయిదా
- అమిత్ షా కనుసన్నల్లో నడుస్తోందన్న ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** రాజ్యసభ జరుగుతున్న తీరుపై విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అమిత్ షా కనుసన్నల్లో సభను నడుపుతున్నారని మండిపడ్డారు. మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ ఉభయసభల్లోనూ ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహిస్తుండడం, ప్రతిపక్షాల గొంతులను అణచివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతకు ముందు ఛైర్మన్ స్థానంలో ఉన్నవారు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడం కూడా సమావేశాల్లో భాగమే అని భావించేవారన్నారు. కానీ ప్రస్తుతం సభల్లో మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారంటూ మండిపడ్డారు. హోంమంత్రి అమిత్‌షా సూచనల ప్రకారం సభలో నడుచుకుంటున్నారని.. అసలు సభను నడిపిస్తున్నది మీరా లేక అమిత్ షా నా? అని డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఖర్గే ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలపై హరివంశ్ నారాయణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధ్యక్షుడు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని సభలోకి తీసుకువచ్చారని.. వారు ప్రతిపక్ష నేతలను తమ ప్రజాస్వామ్య హక్కులు వినియోగించుకోకుండా నిరోధిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు రాజ్యసభలో గందరగోళం సృష్టించారు. వారి వాదనను హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తోసిపుచ్చారు. ప్రతిపక్ష నేతలు సభను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభలో సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని మోహరించారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు ఎలా వ్యవహరించాలనే విషయాన్ని తాను చాలాసార్లు ఈ వ్యక్తులకు చెప్పినప్పటికీ వారు తమ తీరు మార్చుకోవట్లేదని మండిపడ్డారు. తాను దాదాపు 40 ఏళ్లకు పైగా ప్రతిపక్షంలో ఉన్నానని.. ప్రతిపక్ష స్థానాల్లో ఉన్న నేతలు ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలంటే తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోవాలని విపక్ష నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎందుకంటే వారు ఆ స్థానంలో కేవలం పదేళ్లు మాత్రమే ఉన్నారని మరో 40 ఏళ్లు అక్కడే ఉండాలి కాబట్టి ఇటువంటి విషయాలు నేర్చుకోవాలని చురకలు అంటించారు



# కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** జమ్మూకశ్మీర్ (మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. అనారోగ్యం కారణం గా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళ వారం మృతి చెందినట్లు- సన్నిహిత వర్గాలు పేర్కొన్నా యి. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు జరిపి, సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమ యంలో అస్వస్థతకు గురైన సత్యపాల్ మాలిక్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబర్ 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ పనిచేశారు. ఆ సమయంలో ఓ పవర్ ప్రాజెక్ట్ టెండర్ల ప్రక్రియలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో తాజాగా ఆయన నివాసా ల్లో సోదాలు జరిపిన సీబీఐ.. ఆయనతోపాటు మరో ఐదుగురి పేర్లను ఛార్జిషీటులో పేర్కొంది. దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన.. ప్రస్తుతం తాను ఆసుపత్రిలో ఉన్నానని, ఎవరితో మాట్లాడే పరిస్థితిలో లేనన్నారు. అనేకమంది శ్రేయోభిలాషుల నుంచి ఫోన్లు వస్తున్నాయని, వాళ్లతో మాట్లాడలేకపోతున్నానని పేర్కొన్నారు.

# బీహార్ ఓటు సవరణపై నిరసనలు

## పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** బీహార్‌లో ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్‌ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామపక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పాల్గొన్నారు. 'మన ఓటు. మన హక్కు, మన పోరాటం', 'ఎస్‌ఐఆర్-సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్‌ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు- హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చ ని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్‌ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ స భల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.



# అద్వానీ రికార్డు బ్రేక్

## అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 5 :** ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎ లాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరి పాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికా ర్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యత లు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మొత్తంగా అమిత్ షా అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పాలరు.



## నూతన బాధ్యతలు స్వీకరించిన సిఐని సన్మానించిన బిఆర్ఎస్వి నాయకులు

**ఆత్మకూర్ (ఎం )రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా. ఆత్మకూర్(యం) మండలం పోలీస్ స్టేషన్‌కి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ ఎస్.లింగయ్య ని ఆత్మకూరు(ఎం)పట్టణ బిఆర్ఎస్వి అధ్యక్షులు గడ్డం సతీష్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి నాయకులు యాస మహేందర్ రెడ్డి,నాతి మల్లికార్జున్,కూరెళ్ళ వినయ్,మాద నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవు

### సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగించవద్దని పట్టణ సీఐ వెంకటయ్య సూచించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం కుడ కుడ రోడ్డులో పర్యటించి దుకాణదారులు బోర్డులు ఇతర సామాగ్రి ఏర్పాటు చేయగా వాటిని తొలగించి మరోసారి పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకుంటే మంచిదని తెలిపారు. పట్టణ ప్రజలు ఎదురుకుంటున్న ట్రాఫిక్ ఇబ్బందులను ప్రజల సహకారంతో రోడ్డులపై ఉన్న ఆక్రమణలను తొలిగించి పాదచారాలుకు,వాహనదారులకు ఎదురు అవుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించారు. పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి ఆక్రమణలను తొలిగించి ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసిన పోలీస్,మున్సిపల్ సిబ్బందికి వాహనదారులు, ప్రజలు అభినందనలు తెలియజేశారు.



## జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### తెలంగాణా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్

**భువనగిరి రాజముద్ర న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద జర్నలిస్టులకు ఇండ్లు నిర్మించి ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ బాబా అన్నారు.మంగళవారం టి జేయు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నిస్వార్ధంగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని, ఇప్పటివరకు జర్నలిస్టులకు సొంత ఇల్లు లేక అద్దె గృహాల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఈ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు కట్టించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్న బత్తిని మత్యాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి రెహమాన్, జిల్లా ప్రచార కార్యదర్శి బైరపాక సిరిల్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలకు వెంటనే పార్లమెంట్లో చట్టం చేయాలి

### బీసీ రిజర్వేషన్లపై నోరు మెదపని బిజెపి ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలి : సిపిఎం డిమాండ్

**వలిగొండ రాజముద్ర న్యూస్:** దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు పార్లమెంటులో వెంటనే చట్టం చేయాలని బీసీ రిజర్వేషన్ల అమలుపై నోరు మెదపకుండా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బిజెపి తెలంగాణ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు.మంగళవారం రోజున వలిగొండ మండల కేంద్రంలోని భువనగిరి నల్గొండ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే పార్లమెంట్లో చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మద్దెల రాజయ్య,సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడడం బిజెపి మనువాద భావజాలానికి నిదర్శనమని అన్నారు బిజెపి అనుసరిస్తున్న మనువాద భావజాలాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు.బీసీ ప్రధానమంత్రిని అని చెప్తున్న నరేంద్ర మోడీ 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ నిరంతరం బీసీ అని చెప్పుకునే ఈటల రాజేందర్ లు నోర్లు ఎందుకు మెదపడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు 42% బీసీ రిజర్వేషన్లపై నోరు మెదపలేని అసమర్థ బిజెపి ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,కర్ణ కంతి యాదయ్య, కల్లూరి ముత్యాలు, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగయ్య, భూమి మాధవి,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,భూమి బాల శంకర్, మద్దెల మారయ్య,పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, వేముల నాగరాజు, మైసొల్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** విద్యార్థినీ విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తు పనులను చేపట్టి వాడుకలోకి తీసుకురావాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. మంగళవారం దౌల్తాబాద్, బాలంపేట్, గోక ఫసల్ బాద్ లలో గల ప్రభుత్వ పాఠశాలు, బాలంపేట్ లో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో మండల తాసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మరమ్మత్తు పనులు నాణ్యవంతంగా ఉండాలని, టాయిలెట్లు, పాఠశాల గదులకు తలుపులు, కిటికీలు అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. బాల బాలికలకు అనుగుణంగా టాయిలెట్ల ఏర్పాట్లను చేసుకొని పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. స్కావెం జర్ల సిబ్బంది వివరాలతో పాటు నెలవారి జీతాల చెల్లింపులపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.





పాఠశాల పరిసరాల్లో పారిశుధ్యంతో పాటు పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేవిధంగా మొక్కలు నాటాలని కలెక్టర్ అధికారులు సూచించారు. బాలంపేటలోని కేజీబీవీ పాఠశాలలో చేపట్టే పనులతో పాటుగా పడకగదుల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అదేవిధంగా ప్రహరీ చుట్టుగా బ్లూ షీట్లను అమర్చాలని కలెక్టర్ సూచించారు. కోకా పసల్ బాద్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం కోసం అంచనాలను రూపొందించి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుసంధాన రోడ్డును ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం దౌల్తాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన క్రమం లో రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారంలోపు సమస్యలను పరిష్కార దిశగా అధికారులు పనిచేయాలన్నారు. పర్యటనలో భాగంగా హాజరు పట్టికలను పరిశీలించి సకాలంలో పాఠశాలకు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు. లెక్టర్ ఆకస్మిక తనిఖీల్లో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఇఓ రేణుకాదేవి, ఎంఈఓ వెంకటస్వామి, పంచాయతీరాజ్ ఏఈ నాగేంద్ర లతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు చర్యలు చేపట్టాలి

**పాలేరు, తిరుమలాయపాలెం :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం అందుబాటులో ఉండేలాగా వైద్యులు, సిబ్బంది బాధ్యతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రకృతి వైద్యశాల, సామాజిక ఆర్యోగ కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి సేవలు, ఐపీ సేవలు, మెడికల్ ఫార్మసి, ఎమర్జెన్సీ ఓ.టి, క్యాజువాల్టీ, ఇన్ పేషంట్, పురుషుల వార్డు, ప్రసవ గది, ఇసిజి రూమ్, ల్యాబ్ శాంపిల్ గది, ఫీవర్ రిజిస్టర్ పరిశీ లించారు. పేషంట్ల వార్డుల కిటికీలకు పరదాలు పెట్టాలన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని అన్నారు.

### వైద్య సేవలపై ఆరా

ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి నేరుగా గర్భిణీ మహిళలు, పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యాధికారులు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. రోజుకు ఎన్ని ఓ.పి. లను చూస్తున్నది, గర్భిణిలకు ప్రత్యేక సేవలు, సాధారణ కాన్పులకు ఏలాంటి చర్యలు తీసుకుం టున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని, ఆరోగ్య కేంద్రం ఆవరణంలో పేషంట్ల గదులు శుభ్రంగా ఉండేలా చూడాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్య కేంద్రంలోని చుట్టుపక్కల ఖాళీ ప్రదేశం, ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్త లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



### ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

ప్రభుత్వ దవాఖానకు వచ్చే ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. సాధారణ ప్రసవాలు జరిగేలా ఆశా సిబ్బంది గ్రామాలలో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, డెంగ్యూ మలేరియా చికెన్ గున్యా కేసులు తప్పనిసరిగా ప్రత్యేక వైద్య అందించేలాగా చూడాలని తెలిపారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా వైద్యాధికారులు డా. కృపా ఉషశ్రీ, డా. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## బక్కమ్మ వేధింపులపై చర్యలు తీసుకోవాలి

- అంగన్వాడి టీచర్స్ మరియు హెల్పర్ల వినతి
- భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా అధ్యక్షులు షేక్ సుభహాన్ ఆధ్వర్యంలో డి డబ్ల్యూఓ కు విజ్ఞప్తి

**కామేపల్లి, ఆగష్టు 5:** కామేపల్లి అంగన్వాడీ ప్రాజెక్ట్ కు సంబందించిన తిమ్మరావుపేట సర్కిల్ సూపర్వైజర్ బక్కమ్మ ఆ సర్కిల్ లో పనిచేస్తున్నటువంటి కొంతమంది అంగన్వాడి టీచర్ లు మరియు హెల్పేర్ ల పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని , తక్షణమే తనపై చర్యలు తీసుకోవాలని , ఈరోజు భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్ట్) ఆధ్వర్యంలో ఆ డిపార్ట్మెంట్ డిడబ్ల్యూఓ రాంగోపాల్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. అనంతరం ఈ సందర్భంగా ఐయఫ్‌టి యు జిల్లా అధ్యక్షులు షేక్ సుభహన్ మాట్లాడుతూ అంగన్వాడీ కామేపల్లి ప్రాజెక్ట్,తిమ్మారావుపేట సర్కిల్ కు సూపర్వైజర్ గా ఉన్నటువంటి బక్కమ్మ తను చేయాల్సిన ఉద్యోగ బాధ్యతలు మర్చిపోయరని, కనీసం అంగన్వాడి స్కూల్స్ కూడా సందర్శించడం లేదని, అంగన్వాడి టీచర్‌హెల్పర్స్ కు ఇవ్వాల్సిన కనీస గౌరవం కూడా ఇవ్వకుండా ప్రవర్తిస్తున్నారని , అంగన్వాడి టీచర్లు సూపర్వైజర్ బక్కమ్మకు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయడం లేదని వారన్నారు. అందరినీ సమాన్యాయం చేస్తూ పని చేపించాల్సిన సూపర్వైజర్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరైన పద్ధతి కాదని అన్నారు . గతంలో ఇదేవిధంగా ప్రవర్తించి ముగ్గురి ఉద్యోగాలు పోవడానికి ప్రధాన కారకురాలని అన్నారు



. తన మాటే శాసనం మని తను చెప్పినట్టుగా ఎవరైనా వినాలని , లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వారన్నారు. ఒకరితో నన్ను నేను పోల్చుకోను , ఒకరికి నచ్చినట్లు నేను ఉండను, అనే పదాలను వాడుతున్నారని బక్కమ్మ కు మేము ఒకటే చెప్పదలుచుకున్నాం, ఒక ప్రభుత్వ రంగంలో పనిచేస్తూ మతిభ్రమించి మాట్లాడటం మానుకోవాలని వారికి గుర్తు చేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ఒక కార్మిక సంఘానికి కొమ్ముకాస్తున్నారని అన్నారు . ఇతర కార్మిక సంఘాల కార్యక్రమాలకు వెళ్లిన వారిని లక్ష్యం చేసుకొని వేధిస్తున్నటువంటి పరిస్థితి ఉందని, ఏమి పని లేకపోయినా మీరు అర్జెంట్గా ప్రాజెక్ట్ ఆఫీసు దగ్గరికి రావాలి , మీ అంతు చూస్తా మీరేం చేస్తున్నారాని , రకరకాల పదాలతో దూషిస్తున్నారని అన్నారు . కార్మిక సంఘంలో పనిచేయాలని కోరిక ఉంటే ప్రత్యక్షంగా ఆ సంఘం పేరుతో పనిచేయాలని బక్కమ్మను వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఐ యఫ్ టి యు నాయకులు భాను గౌని మోహన్ రావ్ పారిజాతం శిరోమణి లక్ష్మి కళ పద్మ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## వీఐపీ ముసుగులో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

### బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సురేష్ కుమార్



**కూకట్ పల్లి,రాజముద్ర న్యూస్:** ఓ వ్యక్తి తాను ఎంపీ కొడుకునని, న్యూరో సర్జన్‌నని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఒక వ్యక్తిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాకు చెందిన వాయిల వెంకటేశ్వర్లు (29) గా గుర్తించారు. ఇతను డా. విక్రాంత్ రెడ్డి అనే నకిలీ పేరుతో ఈ మోసాలు చేస్తున్నాడు. కేపీహెచ్‌బీలోని సితార ఉమెన్స్ పీజీ హాస్టల్ నడుపుతున్న ఒక మహిళను నిందితుడు మోసం చేశాడు. తన బంధువులు, జూనియర్లను హాస్టల్‌లో చేర్పించే నెపంతో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తాను జూబ్లీహిల్స్‌లో జ్యువెలరీ షాపు నడుపుతున్నానని నమ్మించి, ఆమె బంగారు గొలుసును రీమోడలింగ్ చేస్తానని తీసుకున్నాడు. రీమోడలింగ్ కోసం మరింత బంగారం అవసరమని చెప్పి, ఆమె నుంచి ఆన్‌లైన్‌లో రూ. 55,000, నగదు రూపంలో రూ. 45,000 తీసుకున్నాడు. మొత్తం రూ. 1 లక్షతో పాటు, 4 తులాల బంగారు గొలుసు తీసుకున్న తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. నిందితుడు వెంకటేశ్వర్లు గతంలోనూ ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు నమోదయ్యాయి. బాలానగర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె. సురేష్ కుమార్ ఆదేశాల మేరకు, కూకట్‌పల్లి ఏసీపీ ఇ. రవి కిరణ్ రెడ్డి పర్యవేక్షణలో కేపీహెచ్‌బీ పోలీసులు ఆగస్టు 4, 2025న జేఎన్‌టీయూహెచ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## రైలు ఢీకొని మహిళ మృతి


**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండలంలోని ఎదుల్లగూడెం గ్రామానికి వెళ్లే దారిలో రైలు పట్టాలను దాటుతున్న గుళ్లనీ పోచమ్మ అనే మహిళను రైలు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోచమ్మ భువనగిరి మండలంలోని తాజ్ పూర్ గ్రామం నుండి ఎదుల్లగూడెం గ్రామానికి వస్తుండగా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలో నీరు నిలిచిపోవడంతో బ్రిడ్జి పై నుండి పట్టాలు దాటుతుండగా చెవులు వినపడని, కండ్లు సరిగా కనిపించని పోచమ్మ రైలును గమనించకపోవడంతో రైలు ఢీ కొట్టిందని ఆమె అల్లుడు కొండే నరసింహ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వే పోలీసులు భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



## విద్యార్థులకు షూలు బెల్టులు అందజేసిన నాయిని ధర్మ పాల్ రెడ్డి

**ఆత్మకూర్( ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో ఈరోజు ప్రాథమిక పాఠశాల పల్లెర్లలో స్కూల్ విద్యార్థులకు పల్లెర్ల గ్రామవాసి అయిన నాయిని ధర్మపాల్ రెడ్డి 30 వేల రూపాయల విలువ గల షూ, టై బెల్టులను ఉచితముగా అందజేసిన వస్తువులను ఎంఈఓ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి సోమయ్య సహోపాధ్యాయులు మోహన్ వేణు పాల్గొనడం జరిగింది.

## రష్యా తరపున యుద్ధంలో..
# పాక్, చైనా కిరాయి సైనికులు..



**రష్యా :** రష్యా– ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతుంది. ఈక్రమంలో ఉక్రెయిన్ కీలక ఆరోపణలు చేసింది. తమ దళాలు మాస్కో సైనికులతో పాటు పాకిస్థాన్, చైనాకు చెందిన కిరాయి సైనికులతో కూడా పోరాడాల్సి వస్తుందని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను పాక్ ఖండించింది. వోవ్‌చాన్స్క్ ప్రాంతంలోని సైనిక దళాలతో భేటీ అయినట్లు జెలెన్‌స్కీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఫ్రంట్‌లైన్‌లోని కమాండర్ల గురించి, ఆ ప్రాంతంలోని రక్షణ వ్యవస్థల గురించి వారితో మాట్లాడినట్లు తెలిపారు. డ్రోన్ సరఫరాలు పెంచడం, దళాల నియామకం, బ్రిగేడ్‌లకు ప్రత్యక్ష నిధులపై కూడా చర్చించినట్లు వెల్లడించారు. ఈసందర్భంగా చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్తాన్, పాకిస్థాన్‌తో సహా ఆఫ్రికన్ దేశాల నుంచి వస్తున్న కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు తమ దళాలు గుర్తించాయన్నారు. దీనికి తమ ప్రతిస్పందన గట్టిగా ఉంటుందన్నారు. ఈసందర్భంగా యుద్ధంలో పాల్గొని దేశానికి సేవ చేస్తున్న దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

### ఖండించిన పాకిస్థాన్..

కాగా.. ఈ ఆరోపణలను పాక్ తీవ్రంగా ఖండించింది. జెలెన్‌స్కీవి నిరాధారమైన ఆరోపణలని ఓ ప్రకటనలో పేర్కొంది. వీటిపై తగిన ఆధారాలు చూపించేందుకు కీవ్ అధికారులు ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపింది. ఇదిలాఉండగా.. ఉక్రెయిన్‌తో యుద్ధంలో మాస్కో తరఫున చైనా పౌరులు పాల్గొంటున్నారని గతంలో జెలెన్‌స్కీ ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే, వీటిని బీజింగ్ అప్పుడే ఖండించింది. మరోవైపు.. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు ఉత్తరకొరియా పూర్తి మద్దతు ప్రకటించింది. అందులోభాగంగా భారీ సంఖ్యలో సంప్రదాయ ఆయుధాలను, 10–12వేల మంది వరకు బలగాలను పంపిందని పాశ్చాత్య మీడియా గతంలో వెల్లడించింది.



# కాలిఫోర్నియాలో కార్చిచ్చు..
## 65వేల ఎకరాల్లో చెలరేగిన మంటలు

**కాలిఫోర్నియా :** అమెరికాలోని సెంట్రల్ కాలిఫోర్నియాలో భారీ కార్చిచ్చు సంభవించింది. గత శుక్రవారం మొదలైన ఈ కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తోంది. ఈక్రమంలో గాలి నాణ్యత క్షీణిస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 'గిఫోర్డ్'గా పేర్కొనే ఈ కార్చిచ్చు ప్రస్తుతం 65వేల ఎకరాలకు పైగా విస్తరించింది. భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో చుట్టుపక్కల దట్టమైన పొగ వ్యాపించింది. లాస్ ఏంజెలెస్, వెంచురా, కార్న్ వంటి దక్షిణ కాలిఫోర్నియా కౌంటీల్లోని నివాసితులతో పాటు పొరుగునున్న లాస్ వెగాస్‌లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. గాలినాణ్యత క్షీణిస్తుండటంతో పలు సూచనలు జారీ చేశారు. ప్రభావం ఎక్కువగా ఉండే సమీప ప్రాంతాల్లోని వారిని తరలిస్తున్నారు. మరోవైపు.. మంటలను అదుపు చేసేందుకు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటికి 3శాతం మాత్రమే అదుపులోకి తీసుకురాగలిగామని అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితుల కారణంగా అడ్డంకులు తప్పడం లేదన్నారు. మంటల నేపథ్యంలో చుట్టుపక్కల రహదారులను కూడా అధికారులు మూసేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. ఈ కార్చిచ్చు కారణంగా ముగ్గురు గాయపడ్డారు. వారికి అధికారులు వైద్య సేవలు అందించారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రత్యేక విమానంలో తరలించారు. ఇంకొన్ని రోజుల్లో వాతావరణం మరింత వేడి ఎక్కువవనున్న నేపథ్యంలో పరిస్థితులు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు.



# పీఎం కిసాన్ సాయం పెంపు
## కౌలు రైతులకు వర్తింపుపై కేంద్రం క్లారిటీ

**దిల్లీ:** పీఎం–కిసాన్ పథకం పరిధిని విస్తరించడం, అందించే ఆర్థిక సాయం పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. రైతులకు ఏటా ఒక్కో విడత రూ.2 వేలు చొప్పున మూడు విడతల్లో రూ.6 వేల సాయం అందించే పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. ఈ మొత్తాన్ని నగదు బదిలీ కింద అందిస్తోంది. ఇప్పటివరకు రైతులకు 20 వాయిదాల్లో రూ.3.9 లక్షల కోట్లకు పైగా అందజేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పీఎం–కిసాన్ పథకం పరిధిని విస్తరించడం గానీ, లేదా అందించే సాయాన్ని పెంచే అంశంపై ఎలాంటి ప్రతిపాదనా పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భాగస్వామ్య సాగు రైతులను ఈ పథకంలో చేర్చే అంశంపై వచ్చిన మరో ప్రశ్నకూ సమాధానం ఇచ్చారు. ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే రైతులు సాగు భూమి కలిగి ఉండడమే ప్రధాన అర్హత అని మంత్రి తెలిపారు. తమిళనాడులో అమలవుతున్న 'Uzhavan App' తరహాలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ వివరాలు, సలహాలు అందించే విధంగా కేంద్రం ఏదైనా యాప్‌ను ప్రవేశపెట్టనుందా? అని అడిగిన ప్రశ్నకు.. ప్రస్తుతం అటువంటి ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదన్నారు. అయితే, వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు, సలహాలకు 'కిసాన్ కాల్ సెంటర్'ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవల కోసం రైతులు 1800–180–1551 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చెయొచ్చని, ప్రాంతీయ భాషల్లోనే సమాధానాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# వాణిజ్య భాగస్వాముల ఎంపిక మా హక్కు
## ట్రంప్‌కు రష్యా స్ట్రాంగ్ కౌంటర్



**రష్యా:** పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎదుర్కొంటున్న రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపేయాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి తెస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే భారత్‌పై సుంకాలను పెంచుతామని బెదిరించినందుకు ట్రంప్‌పై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ తీవ్ర స్థాయిలో మండిపడింది. భారతదేశంపై అమెరికా అక్రమ వాణిజ్య ఒత్తిడిని కలిగిస్తోందని విమర్శించింది. సార్వభౌమ దేశాలకు తమ వాణిజ్య భాగస్వాములను సొంతంగా ఎంచుకునే హక్కు ఉంటుందని అగ్రరాజ్యానికి స్పష్టం చేసింది. భారత్‌పై ట్రంప్ చేస్తున్న బెదిరింపులు అసమర్థమైనవని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ విమర్శించారు. "ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోకపోవడంతో మాతో వాణిజ్య సంబంధాలు రద్దు చేసుకోవాలని అగ్రరాజ్యం ఇతర దేశాలను బెదిరించడం మేం గమనిస్తూనే ఉన్నాం. అటువంటి బెదిరింపులను చట్టబద్ధమైనవిగా పరిగణించం. ఎందుకంటే సార్వభౌమ దేశాలు వాణిజ్య, ఆర్థిక సహకారం కోసం సొంతంగా తమ వాణిజ్య భాగస్వాములను ఎంచుకునే హక్కును కలిగి ఉంటాయని మేం విశ్వసిస్తున్నాం. అందుకు విరుద్ధంగా అమెరికా ఇలాంటి బెదిరింపులకు పాల్పడడం సరైన చర్య కాదు" అని దిమిత్రీ పెస్కోవ్ అన్నారు. రష్యా యుద్ధంలో ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నా భారత్ పట్టించుకోవడం లేదని.. అందువల్ల ఆ దేశంపై గణనీయంగా సుంకాలు పెంచుతానని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయన మాటలపై ఇప్పటికే రష్యా స్పందిస్తూ.. అంతర్జాతీయ వేదికపై తన ఆధిపత్యం క్షీణించడాన్ని అమెరికా జీర్ణించుకోలేకపోతోందని పేర్కొంది. ఈ క్రమంలోనే తన స్థానాన్ని నిలబెట్టుకునేందుకు ఆధునిక వలసవాదాన్ని పాటిస్తోందని తనను అనుసరించేందుకు నిరాకరిస్తున్న దేశాలపై రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు తీసుకొస్తోందని రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఆరోపించారు. గ్లోబల్ సౌత్‌లోని రష్యా భాగస్వాముల విషయంలో ట్రంప్ సుంకాల విధానంపై మాట్లాడుతూ.. సంబంధిత దేశాల సార్వభౌమాధికారంపై ప్రత్యక్ష ఆక్రమణగా, అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ప్రయత్నంగా పేర్కొన్నారు.

## అమెరికా నిర్ణయం..
# ఐరోపాకు ప్రాణసంకటం
## అణు ఒప్పందం నుంచి రష్యా ఔట్



**రష్యా :** రష్యాను బెదిరించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకొన్న ఓ తొందరపాటు నిర్ణయం ఐరోపా దేశాలకు ప్రాణసంకటంగా మారనుంది. మధ్యశ్రేణి క్షిపణులను మోహరించకుండా మాస్కో–వాషింగ్టన్‌ల మధ్య ఉన్న ఐఎన్ఎఫ్ (ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీ) ఒప్పందాన్ని ఇక ఏమాత్రం అనుసరించబోమని రష్యా ప్రకటించింది. పశ్చిమదేశాలు తమ జాతీయ భద్రతకు నేరుగా ముప్పును సృష్టించాయని ఆరోపించింది. ఈక్రమంలో ఒప్పందాన్ని అనుసరించే పరిస్థితులు లేవని తేల్చిచెప్పింది. ఈమేరకు రష్యా విదేశాంగశాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. తాము కొన్నిరకాల క్షిపణులను మోహరించకుండా విధించుకొన్న ఆంక్షలను ఇక పాటించబోమంది. అమెరికా దళాలు ఫిలిప్పీన్స్‌లో టైఫూన్ క్షిపణి లాంచర్లను మోహరించడం, ఆస్ట్రేలియా సమీపంలోని టలిస్మాన్ సాబ్రె డ్రిల్స్‌లో క్షిపణులను పరీక్షించడం దీనికి ప్రధాన కారణంగా వెల్లడించింది. మరోవైపు ట్రంప్ చర్యలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. ఇటీవలే రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ ప్రకటనకు స్పందనగా.. రెండు ఒహైయో శ్రేణి అణు జలాంతర్గాములను మోహరించేలా ఆదేశాలు జారీ చేశారు.

### అసలేమిటీ ఐఎన్ఎఫ్ ఒప్పందం..?

1987లో అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్, రష్యా అధినేత మిఖాయిల్ గోర్బచేవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇంటర్మీడియట్ రేంజి న్యూక్లియర్ ఫోర్స్ ట్రీటీగా దీనిని వ్యవహరిస్తారు. దీనిప్రకారం భూ ఉపరితలంపై నుంచి ప్రయోగించే మధ్యశ్రేణి రేంజి క్షిపణుల మోహరింపును నిషేధించారు. 500 కిలోమీటర్ల నుంచి 5,500 కిలోమీటర్ల మధ్యలోవి ఈ ఒప్పంద పరిధిలోకి వస్తాయి. అప్పట్లో ఐఎన్ఎఫ్ ట్రీటీ కారణంగా సోవియట్ అమెరికాలకు చెందిన దాదాపు 2,692 క్షిపణులను ధ్వంసం చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిని ప్రచ్ఛన్న యుద్ధాన్ని మలుపుతిప్పిన సంధిగా భావిస్తారు. వాస్తవానికి ఈ ఇంటర్మీడియట్ రేంజి క్షిపణుల మోహరింపుతో అమెరికా మిత్రులైన ఐరోపా దేశాలకే ప్రధాన ముప్పు. 2019లో ట్రంప్ ఈ ఒప్పందం నుంచి అమెరికాను బయటకు లాగేశారు. రష్యా సుదర్ఘీకాలంగా దీనిని ఉల్లంఘిస్తోందని ఆయన నాడు ఆరోపించారు. 9ఎం729 లేదా ఎస్ఎస్‌సీ–8 క్షిపణులను మోహరించిందని పేర్కొన్నారు. దీనిని నాడు మాస్కో తిరస్కరించింది. ఇప్పుడు ట్రంప్ అణు జలాంతర్గాముల మోహరింపు ఆదేశాలు వెలువడిన మూడు రోజులకు రష్యా కూడా ఈ ఒప్పందం నుంచి బయటకు వచ్చేస్తామని ప్రకటించింది.

## ఆ సుంకాలపై చర్చలకు
# అమెరికా అంగీకరించలేదు : కేంద్రం



**న్యూఢిల్లీ :** భారత్ అల్యూమినియం, ఉక్కు, సంబంధిత ఉత్పత్తులపై అమెరికా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. దీనిపై ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందం కింద చర్చలకు రావాలంటూ భారత్ చేసిన అభ్యర్థనకు అమెరికా అంగీకరించలేదని కేంద్రమంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభలో వెల్లడించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటిని విధించినట్లు అగ్రరాజ్యం వాదించిందని లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. దిగుమతి సుంకాల విషయంలో డబ్ల్యూటీవో అగ్రిమెంట్స్ ఆన్ సేఫ్‌గార్డ్స్ నిబంధనలను అమెరికా పాటించనందున.. భారత్ సైతం అదే స్థాయిలో చర్యలు తీసుకునే హక్కు కలిగి ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. స్టీల్, అల్యూమినియంపై అమెరికా సుంకాల విధింపును రక్షణాత్మక చర్యలుగా భారత్ భావిస్తోంది. డబ్ల్యూటీవో అగ్రిమెంట్స్ ఆన్ సేఫ్‌గార్డ్స్ కింద సంప్రదింపులకు లోబడి ఉండాల్సిన అంశంగా దీన్ని పరిగణిస్తోంది. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై కొనసాగుతున్న చర్చల్లో భారత్ చురుకుగా పాల్గొంటోందని మంత్రి మరో సమాధానంలో తెలిపారు. రైతులు, దేశీయ పరిశ్రమల ప్రయోజనాలను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఈ ఏడాది మార్చిలో చర్చలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు ఐదు రౌండ్ల చర్చలు జరిగాయి. తుర్కియే, అజర్‌బైజాన్‌లతో వాణిజ్య, పర్యాటక కార్యకలాపాలను నిలిపివేయడం, పరిమితం చేయడం దిశగా కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. అయితే, తుర్కియే నుంచి దిగుమతుల విలువ 2023–24లో 3.78 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2024–25 నాటికి 2.99 బిలియన్లకు తగ్గింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ప్రకటించిన తుర్కియే, అజర్‌బైజాన్‌లపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే.

# ఆ తీర్పులో తప్పిదాలున్నాయ్..
## అలహాబాద్ హైకోర్టుపై 'సుప్రీం' ఆగ్రహం



**అలహాబాద్ :** అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఓ సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మారుస్తూ.. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పులతడకగా పేర్కొంది. సివిల్ కేసు పరిష్కారానికి సమయం పడుతుందనే కారణంతో సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు సమర్థించడం పట్ల అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యలు న్యాయస్థానం తనకున్న హక్కులను దుర్వినియోగం చేయడమే అని అభిప్రాయ పడింది. సివిల్ సమస్యలను పరిష్కరించడానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమనే చట్టపరమైన నిబంధనలను.. ఇరు కేసుల మధ్య ఉన్న వ్యత్యాసాలను హైకోర్టు అర్థం చేసుకుంటుందని తాము ఆశించినట్లు ధర్మాసనం పేర్కొంది. ఇకపై న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో ఇలాంటి అతిక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. సంబంధిత న్యాయమూర్తి ఆ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించింది. అంతే కాకుండా ఆ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పదవీ విరమణ చేసే వరకు ఆయనకు ఎటువంటి క్రిమినల్ కేసులూ కేటాయించకుండా చూసుకోవాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. కాగా, ఇప్పటికే పలు కోర్టులు, పోలీసులు ఆస్తి వివాదాలకు సంబంధించిన సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా మార్చడాన్ని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు తప్పుబట్టిన విషయం తెలిసిందే.




# వీసాలపై అమెరికా మరో బాంబ్..
## 15,000 డాలర్లు కట్టాల్సిందే..

**వాషింగ్టన్:** వలసదారులపై కఠిన ఆంక్షలు అమలుచేస్తోన్న అమెరికా.. తాజాగా వీసా ఆశావహుల నెత్తిన మరో బాంబు పేల్చేందుకు సిద్ధమైంది. బిజినెస్, టూరిస్ట్ వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు షూరిటీ కింద 15వేల డాలర్ల వరకు బాండ్ చెల్లించాలని అగ్రరాజ్య విదేశాంగశాఖ ప్రతిపాదనలు చేసింది. ఈమేరకు ఫెడరల్ రిజిస్ట్రీలో మంగళవారం (స్థానిక కాలమానం ప్రకారం) నోటీసులు పబ్లిష్ చేయనుంది. 12 నెలల పైలట్ ప్రోగ్రామ్ కింద ఈ కొత్త నిబంధన తీసుకురానున్నట్లు విదేశాంగ శాఖ తెలిపింది. బీ–1 (బిజినెస్), బీ–2 (టూరిస్ట్) వీసాలపై ఈ నిబంధనను తీసుకురానున్నారు. ఫెడరల్ రిజిస్ట్రీలో అధికారి నోటీసు పెట్టిన 15 రోజుల్లోపు ఈ పైలట్ ప్రోగ్రామ్ అమల్లోకి రానుంది. దీని ప్రకారం.. బిజినెస్, పర్యాటక వీసా కోసం దరఖాస్తు చేసుకునేవారు అమెరికా ప్రవేశం పొందాలంటే కనీసం 5వేలు, 10వేలు, లేదా 15వేల సెక్యూరిటీ బాండ్లను సమర్పించాల్సి ఉంటుంది. వీసా కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఈ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ సదరు వీసాదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకొని.. గడువు పూర్తయిన తర్వాత దేశం వీడితే ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తారు. అలాకాకుండా.. చట్టవిరుద్ధంగా వ్యవహరించినా.. వీసా గడువు ముగిశాక కూడా అగ్రరాజ్యంలోనే ఉన్నా.. ఎలాంటి రీఫండ్ దక్కదు. అయితే, ఈ బాండ్ నిబంధన అన్ని దేశాల ప్రజలకు ఉండదట. షూరిటీ వర్తించే దేశాల జాబితాను అమెరికా విదేశాంగ శాఖ త్వరలోనే ప్రకటించనుంది. 90 రోజుల బిజినెస్, పర్యాటక ప్రయాణాల కోసం తీసుకొచ్చిన వీసా వేవర్ ప్రోగ్రామ్‌లో ఉన్న దేశాలకు ఈ బాండ్ వర్తించబోదని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 42 దేశాలు ఉన్నాయి. అందులో మెజార్టీ ఐరోపా దేశాలు కాగా.. ఆసియా, మధ్యప్రాచ్యం నుంచి కొన్ని దేశాలున్నాయి. అంతేకాదు.. వీసా దరఖాస్తుదారు ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కూడా ఒక్కోసారి బాండ్ల నుంచి మినహాయింపు కల్పించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. వీసా గడువు తీరినా కొంతమంది దేశం విడిచి వెళ్లడం లేదని, వారి వల్ల దేశ భద్రతకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ మార్పులు తీసుకొస్తున్నట్లు ట్రంప్ యంత్రాంగం చెబుతోంది. గతంలో ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ ఈ తరహా పైలట్ ప్రాజెక్టును తీసుకొచ్చారు. 2020 నవంబరులో వీసాలకు బాండ్ల నిబంధనను ప్రకటించారు. అయితే, కొవిడ్ మహమ్మారి కారణంగా అప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు నిలిచిపోవడంతో ఈ నిబంధన పూర్తిస్థాయిలో అమలుకాలేదు.

# 'రాహుల్ వ్యాఖ్యలు సరైనవే..'
## ఇండియా కూటమి పార్టీల నేతలు



**న్యూఢిల్లీ :** భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు నిన్న మందలించిన సంగతి తెలిసిందే. రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావేశమై చర్చించారు. "రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయస్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు" అని కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. రాజకీయ పార్టీలకు.. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష నేతలకు జాతీయ సమస్యలపై ప్రశ్నించే బాధ్యత ఉంటుందని ఆ పార్టీ పేర్కొంది. రాహుల్ గాంధీ భారత భద్రతా దళాలను ఎంతో గౌరవిస్తారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. "నిజమైన భారతీయుడు ఎవరు అనేది వారు నిర్ణయించలేరు. ప్రభుత్వాన్నికి ప్రశ్నలు సంధించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యత" అని అన్నారు. రాహుల్ ఎప్పుడూ సైన్యానికి వ్యతిరేకంగా మాట్లాడరు, ఆర్మీని గౌరవిస్తారని ప్రియాంక గాంధీ తెలిపారు.

# 'వాళ్లంతా స్వర్గానికే..'
## వరద బాధితులతో మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



**ఉత్తర్‌ప్రదేశ్ :** భారీ వర్షాల కారణంగా నదులు ఉప్పొంగి చోటు చేసుకొనే విపత్తుల్లో తీర ప్రాంతాల ప్రజలు సర్వం కోల్పోతుంటారు. ఒంటిమీద దుస్తులు తప్ప ఎలాంటి ఆధారం లేకుండా మిగిలిపోతుంటారు. అలాంటి వారిని దగ్గరి నుంచి చూసినప్పుడు ఎవరికైనా హృదయం మెలిపెడుతుంది. వారికి ఓదార్పునిచ్చేలా మాట్లాడాల్సిన చోట.. ఓ మంత్రి వారి సమస్యను చాలా తేలిగ్గా తీసుకున్నారు. వారితో ఆయన మాట్లాడిన మాటలు వివా దాస్పదంగా మారాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాన్పుర్ దెహాత్ జిల్లాలో వరదలు సంభ వించాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో యూపీ మంత్రి సంజయ్ నిషాద్ పర్యటిం చగా.. బాధితులు ఆయన వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. "మా ప్రాంతమంతా నీటమునిగింది. ఇళ్లు కూలిపోయాయి. ఇప్పుడు మేం ఎక్కడకు వెళ్లాలో తెలియడం లేదు" అని వాపోయారు. వారి బాధలు విన్న తర్వాత మంత్రి నుంచి వచ్చిన స్పందనకు వారు కంగుతిన్నారు. "గంగమ్మతల్లి తన తన బిడ్డల పాదాలు కడగడానికి వస్తుంది. ఆ దర్శనం ద్వారానే ఆ బిడ్డలు స్వర్గానికి వెళతారు. మిమ్మల్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి" అంటూ సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. భాజపా నేతృత్వంలోని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వంలో నిషాద్ పార్టీ భాగస్వామ్య పక్షంగా ఉంది. సంజయ్ ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారు. భారీ వర్షాల కారణంగా ఆగ్రా, చిత్రకూట్, లఖింపుర్ ఖేరీ వంటి 17 జిల్లాలు వరద ప్రభావానికి గురయ్యాయి. గంగా, యమునతో సహా పలు నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. అయితే తర్వాత మంత్రి వరద సహాయాన్ని అందించారు.

# ఆ విషయంలో 'మిస్టర్ యాంగ్రీ' వైపే మెక్‌కల్లమ్ : డీకే

**'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' కోసం ఇంగ్లాండ్ ప్రధాన కోచ్ మెక్‌కల్లమ్ తొలుత శుభ్‌మన్ గిల్ పేరును ప్రతిపాదించాడు. ఓవల్ టెస్టు ఐదోరోజు ఆటలో మాత్రం సిరాజే హైలైట్. చివరికి గిల్‌తో పాటు బ్రూక్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ దక్కింది. అయితే, సిరాజ్‌కు ఇస్తే బాగుండేదని మెక్‌కల్లమ్ భావించినట్లు భారత మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ వెల్లడించాడు. మరోవైపు 'మిస్టర్ యాంగ్రీ'గా సిరాజ్‌కు ఇంగ్లాండ్ ఆటగాళ్లు నిక్‌నేమ్ పెట్టారని నాసిర్ హుస్సేన్ తెలిపాడు. ఇకనైనా సిరాజ్‌ను నంబర్ 1 బౌలర్‌గా గుర్తించాలని.. ఇప్పటికే ఆలస్యం చేసినట్లు అశ్విన్ వ్యాఖ్యానించాడు.**




"నాలుగో రోజే మ్యాచ్ ముగిసిఉంటే ఇప్పటిలానే శుభ్‌మన్ గిల్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును ముందే తీసుకొనేవాడు. అతడి పేరును ఇంగ్లాండ్ కోచ్ మెక్‌కల్లమ్ ప్రతిపాదించాడు. కామెంటేటర్ మైక్ అథర్టన్ కూడా ప్రశ్నలు సిద్ధం చేసుకున్నాడు. కానీ, మ్యాచ్ ఐదో రోజుకు వెళ్లింది. అక్కడ సిరాజ్ ఐదు వికెట్ల ప్రదర్శనతో భారత్‌ను గెలిపించాడు. దీంతో మెక్‌కల్లమ్ తన అభిప్రాయాన్ని మార్చుకొన్నాడు. సిరాజ్ బౌలింగ్‌ను ఆస్వాదించినట్లు చెప్పాడు. బంతిని బ్యాట్ డామినేట్ చేసిన ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ అద్భుతం చేశాడు. బుమ్రా గైర్హాజరీలో పేస్ ఎటాక్‌ను ముందుండి నడిపించాడు. అందుకే, సిరాజ్‌కే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ఇస్తే బాగుండేదన్న అభిప్రాయం మెక్‌కల్లమ్‌కు వచ్చి ఉంటుంది" అని డీకే వెల్లడించాడు. అయితే, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సిరాజ్‌కు అవార్డు దక్కింది.

### ఇంగ్లాండ్ ప్లేయర్లు అలా పిలుస్తారు: నాసిర్

"సిరాజ్ ఎప్పుడూ ఫైర్‌లోనే ఉంటాడు. అందుకే ఇంగ్లాండ్ ఆటగాళు అతడిని 'మిస్టర్ యాంగ్రీ'గా పిలుస్తారు. సిరాజ్ మైదానంలో బాగా ఎంటర్‌టైన్ చేస్తాడు. అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకే ప్రయత్నిస్తాడు. ఆటపై అభిరుచి, మనసంతా ఇక్కడే ఉంచే స్వభావం, అద్భుతమైన నైపుణ్యం కలిగిన ప్లేయర్. జోరూట్ వంటి బ్యాటర్‌ను ఎల్బీ చేయడం చాలా కష్టం. కానీ, సిరాజ్ మాత్రం సులువుగా బుట్టలో వేశాడు. కొత్త బంతిని వద్దని పాత బంతితోనే నాణ్యమైన పేస్‌ను రాబట్టాడు" అని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ తెలిపాడు.

### ఇకనైనా గుర్తిస్తే బాగుంటుంది: అశ్విన్

"సిరాజ్ ప్రతిభను గుర్తించడంలో మనం విఫలమయ్యాం. ఇప్పటికే ఎంతో ఆలస్యమైంది. ఇప్పుడు సరైన సమయంగా భావిస్తున్నా. అతడి సంబరాలు చూస్తుంటే 'ఇది ట్రైలర్ కాదు.. అసలైన సినిమా. నన్ను కూడా మ్యాచ్ విన్నర్‌గా పరిగణించండి' అన్నట్లుగా ఉంది. అతడొక ఛాంపియన్ బౌలర్ అని మనకు గుర్తుచేసినట్లుగా ఉంది. ఆటపై నిబద్ధత, టెక్నిక్, బౌలింగ్ యాక్షన్‌తో ఐదు టెస్టులూ ఆడేలా చేశాయి. అయితే, అతడి వయసూ పెరుగుతోంది. తప్పకుండా విశ్రాంతి ఇవ్వాల్సిన బాధ్యత మేనేజ్‌మెంట్‌పై ఉంది. ఇప్పుడు సిరాజ్ మీ నంబర్ 1 బౌలర్ కావచ్చు. వరుసగా టెస్టులు ఆడితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. అందుకే మిగతా బౌలింగ్ ఎటాక్‌ను సిద్ధం చేసుకొనేందుకు ప్రయత్నించాలి. ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్.. ఇలా కుర్రాళ్లకు అవకాశాలు ఇస్తూ వెళ్లాలి. సిరాజ్ అనుభవంతో వారిని జోడించాలి" అని రవిచంద్రన్ అశ్విన్ వ్యాఖ్యానించాడు.



## ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్
# వాషింగ్టన్ సుందర్

ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-2తో ముగించిన సంగతి తెలిసిందే. ఐదో టెస్టులో భారత్ అద్భుతంగా ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను సమం చేసింది. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లూ హోరాహోరీగా ఐదో రోజు వరకు సాగాయి. పెద్దగా అనుభవం లేని ఆటగాళ్లతో ఇంగ్లాండ్‌కు వెళ్లిన భారత్.. మంచి ఫలితాలే సాధించింది. ఈ సిరీస్‌లో కొంతమంది ఆటగాళ్లు ఊహించిన దాని కంటే మెరుగైన ప్రదర్శన చేశారు. ఆ జాబితాలో వాషింగ్టన్ సుందర్ ముందు వరసలో ఉంటాడు. ఈ యువ ఆల్‌రౌండర్ టీమ్‌ఇండియా ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లలందరూ సమావేశమయ్యారు. తొలుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాట్లాడాడు. టీమ్‌ఇండి యా ప్లేయర్లు అద్భుతంగా పోరాడి సిరీస్‌ను 2-2తో ముగించినందుకు అభినం దనలు తెలిపాడు. భవిష్యత్‌లో ఇదే విధంగా మెరుగైన ప్రదర్శన చేస్తే సుదీర్ఘకాలం టెస్టు క్రికెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తామన్నాడు. అనంతరం సీనియర్ ఆటగాడు రవీంద్ర జడేజా ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సుందర్‌కు అందజేశాడు. ఇంగ్లాండ్‌లో వరుసగా నాలుగు మ్యాచ్‌లు ఆడటం చాలా గొప్ప అనుభూతి అని, ఇక్కడ ఎప్పుడూ బాగా రాణించాలని కోరుకుంటానని సుందర్ పేర్కొన్నాడు. ఈ సిరీస్‌లో వాషింగ్టన్ సుందర్ తొలి టెస్టులో మినహా అన్ని మ్యాచ్‌ల్లో ఆడాడు. ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో భారత్‌కు కీలకంగా మారాడు. ఎనిమిది ఇన్నింగ్స్‌ల్లో కలిపి 47.33 సగటుతో 284 పరుగులు చేశాడు. నాలుగో టెస్టులో జడేజాతో కలిసి సెంచరీ చేసి మ్యాచ్ డ్రాగా ముగియడంలో కీలకపాత్ర పోషించాడు. మొత్తం ఏడు వికెట్లు పడగొట్టిన సుందర్.. ఇందులో నాలుగు లార్డ్స్‌లో సాధించాడు.




## ఎయిర్‌టెల్ లాభం రూ.5,947 కోట్లు

ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.5,947 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,159 కోట్లతో పోలిస్తే నికర లాభం 43 శాతం మేర పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.38,506 కోట్ల నుంచి 28 శాతం వృద్ధితో రూ.49,463 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. భారతీ ఎయిర్‌టెల్ ఇండియా ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.37,585 కోట్లుగా నమోదైంది. టెలికాం కంపెనీల ఆదాయాలను కొలమానంగా వ్యవహరించే ఒక యూజర్ నుంచి వచ్చే సగటు ఆదాయం సైతం పెరిగింది. గతేడాది రూ.211 ఉండగా.. ఈ ఏడాది ఆ మొత్తం రూ.250కి చేరింది. ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు విలువ 0.82 శాతం పెరిగి రూ.1,930.30 వద్ద ముగిసింది.



## రూ.17వేల కోట్ల మోసం కేసు
### ఈడీ ఎదుట హాజరైన అనిల్ అంబానీ

**ఢిల్లీ:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. రూ.17వేల కోట్ల రుణ మోసాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రశ్నించేందుకు ఇటీవల దర్యాప్తు సంస్థ ఆయనకు సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నేడు ఆయన ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయానికి చేరుకొని అధికారుల ముందు హాజరయ్యారు. ఈ కేసులో అనిల్ అంబానీ వాంగ్మూలాన్ని ఈడీ నమోదు చేయనుంది. ఇటీవల రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 కంపెనీలకు చెందిన 35 ప్రాంతాల్లో, 25 మంది వ్యక్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన అనంతరం.. అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. జులై 24 నుంచి మూడు రోజుల పాటు ఈ సోదాలు జరిగాయి. ఇందులో కీలక దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇక, ఇదే కేసులో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లకు కూడా సమన్లు జారీ అయ్యాయి. అమితాబ్ ఝున్‌ఝున్‌వాలా, సతీశ్ సేథ్ సహా గ్రూప్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈడీ సమన్లు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రిలయన్స్ ఇన్‌ఫ్రా సహా అనిల్ అంబానీకి చెందిన పలు కంపెనీలు రూ.17,000 కోట్లకు పైగా నిధులను అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ ఈ చర్యలు చేపట్టింది. ఇందులో రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ రూ.5,901 కోట్లు, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ రూ.8,226 కోట్లు, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు సంబంధించి రూ.4,105 కోట్ల రుణాలు ఉన్నాయి. ఇప్పటికే అనిల్ అంబానీ దేశం విడిచి వెళ్లకుండా లుకౌట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ)ను కూడా ఇచ్చింది.

## టారిఫ్ భయాలు..
# మార్కెట్లకు నష్టాలు


**ముంబయి:** దేశీయ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాలను చవిచూశాయి. ట్రంప్ టారిఫ్ భయాలకు తోడు ఆర్‌బీఐ సమీక్షకు ముందు మదుపర్లు అప్రమత్తత పాటించారు. దీంతో నేటి (ఆగస్టు 5) ట్రేడింగ్‌లో సూచీలు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పడిపోగా.. నిఫ్టీ 24,700 మార్క్ కోల్పోయింది. ఈ ఉదయం 80,946.43 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ రోజంతా ఒడుదొడుకుల్లోనే సాగింది. ఒక దశలో 80,554 వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి పడిపోయిన సూచీ చివరకు 308.47 పాయింట్లు తగ్గి 80,710.25 వద్ద ముగిసింది. అటు నిఫ్టీ కూడా 24,590-24,733 మధ్య కదలాడింది. మార్కెట్ ముగిసే సమయానికి 73.20 పాయింట్లు కోల్పోయి 24,649.55 వద్ద స్థిరపడింది. టారిఫ్ ఎఫెక్ట్, ముడిచమురు ధరల నేపథ్యంలో రూపాయి విలువ మరింతగా క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో 15 పైసలు పతనమై 87.81 వద్ద ముగిసింది. నిఫ్టీలో ఇన్ఫోసిస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేర్లు భారీగా నష్టపోయాయి.



### మార్కెట్ పతనానికి కారణాలివే..

- రష్యా చమురును కొనుగోలు చేస్తే భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.
- విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. సోమవారం రూ.2,566.51 కోట్ల విలువైన ఈక్విటీలను ఎఫ్‌ఐఐలు విక్రయించారు.
- ట్రంప్ టారిఫ్‌ల భయాలతో చమురు, గ్యాస్ రంగ షేర్లు కుదేలయ్యాయి. దాదాపు 1 శాతం మేర కుంగాయి.
- ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు బుధవారం వెలువడనున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినప్పటికీ.. ప్రస్తుత పరిస్థితుల్లో రేట్ల కోతపై రిజర్వ్ బ్యాంక్ ఆచితూచి వ్యవహరించనుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి.

# భారత్‌తోనే చెట్టాపట్టాల్..
### ట్రంప్ వ్యాఖ్యలు పట్టించుకోని టిమ్ కుక్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చిర్రెత్తించే విషయాన్ని వెల్లడించారు యాపిల్ సీఈఓ టిమ్ కుక్. భారత్‌లో ఫోన్ల తయారీ చేపట్టడంపై ట్రంప్ తన అసహనం వ్యక్తంచేయగా.. ఆయన వ్యాఖ్యలను పెడచెవిన పెట్టారు. అమెరికాలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో అమ్ముడైన ఐఫోన్లలో మెజారిటీ ఫోన్లు భారత్‌లో తయారైనవేనని చెప్పారు. మున్ముందూ యాపిల్ తయారీ భారత్‌లో కొనసాగుతుందని స్పష్టంచేశారు. యాపిల్ త్రైమాసిక ఫలితాల అనంతరం ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌లో ఐఫోన్ల తయారీని చేపట్టడాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. మే నెలలో దోహా పర్యటన సందర్భంగా తన మనసులో మాటను బయటపెట్టారు. భారత్‌లో తయారీ చేపట్టడం తనకే మాత్రం ఇష్టంలేదంటూ టిమ్‌కుక్ సమక్షంలో నే చెప్పారు. మరోవైపు ట్రేడ్ డీల్ విషయంలో గుర్రుగా ఉన్న ట్రంప్.. భారత్‌పై 25 శాతం సుంకాలను విధించారు. అయితే, అందులో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను మినహాయించారు. దీంతో ప్రస్తుతానికి ఐఫోన్లపై టారిఫ్ ఎఫెక్ట్ లేనట్లే. అయితే మున్ముందూ పరిస్థితి ఇలానే ఉంటుందని చెప్పలేమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### టిమ్ కుక్ తగ్గేదేలే..

యాపిల్ రెండో త్రైమాసిక ఫలితాల సందర్భంగా టిమ్ కుక్ మాట్లాడుతూ.. గత త్రైమాసికంలో కొనసాగిన వైఖరే మున్ముందూ కొనసాగుతుందని స్పష్టంచేశారు. "అమెరికాలో విక్రయమయ్యే ఫోన్లు దాదాపుగా భారత్‌లో తయారైనవే. అమెరికాలో వినియోగించే ఇతర యాపిల్ ఉత్పత్తులైన మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, యాపిల్ వాచ్‌లను వియత్నాంలో తయారుచేస్తున్నాం. ఇతర దేశాలకు చైనా నుంచి ఎగుమతి చేస్తున్నాం" అని టిమ్ కుక్ వివరించారు. తయారీపరంగానే కాదు.. ఆదాయం పరంగానూ యాపిల్‌కు భారత్ కలిసొచ్చింది. ఐఫోన్ల విక్రయం ద్వారా భారత్‌లో రికార్డు రెవెన్యూ వృద్ధి నమోదైందని టిమ్‌కుక్ వెల్లడించారు. భారత్, పశ్చిమాసియా, దక్షిణాసియా, బ్రెజిల్‌లో రెండంకెల వృద్ధి నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా సగటున 10 శాతం వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. అంతేకాదు భారత్‌లో రిటైల్ విక్రయాలు పెంచేందుకు మరిన్ని ఫిజికల్ స్టోర్లు తెరవబోతున్నట్లు అనలిస్ట్ కాల్‌లో కుక్ వెల్లడించారు.




## ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త..
### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హెచ్చరిక

సైబర్ నేరగాళ్లు ఈ మధ్యకాలంలో ఏపీకే ఫైల్స్‌తో పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. వీటి సాయంతో స్మార్ట్‌ఫోన్లను తమ కంట్రోల్‌లోకి తీసుకుని నగదును కొల్లగొడుతున్నారు. ఈ తరహా ఫైల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రైవేటు రంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తాజాగా ఒక హెచ్చరిక జారీ చేసింది. మొబైల్‌కు వచ్చే ఎటువంటి ఏపీకే ఫైల్స్‌నూ డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించింది. వినియోగదారులు థర్డ్ పార్టీ యాప్స్ ఉపయోగించొద్దని, ఏవైనా లింక్‌లు వచ్చినపుడు పంపిన వ్యక్తి నమ్మదగిన వారేనా? అని తనిఖీ చేసుకోవాలని తెలిపింది. సైబర్ నేరస్థులు తాము బ్యాంకు ఉద్యోగులు, ప్రభుత్వ అధికారులమని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు. ఆ తర్వాత ఓ ఏపీకే ఫైల్‌ను పంపించి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ఒకసారి ఈ ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే బాధితుల మొబైల్ ఫోన్‌పై మోసగాళ్లకు పూర్తి నియంత్రణ లభిస్తుంది. తద్వారా మీ ప్రమేయం లేకుండానే మీ బ్యాంక్ ఖాతాల నుంచి అనధికార లావాదేవీలు చేయగలరు. అంతేకాకుండా మీ ఫోన్‌కు వచ్చే కాల్స్, మెసేజ్‌లను వేరే డివైజ్‌కు మళ్లించగలరు. ఫోన్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలపైనా వారికి పూర్తి నియంత్రణ వస్తుంది. కాబట్టి అప్రమత్తత అవసరమని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పేర్కొంది. ఏవైనా సైబర్ మోసాలు జరిగితే సైబర్ క్రైమ్ పోర్టల్ https://sancharsaathi.gov.in/లో రిపోర్ట్ చేయాలని సూచించింది.



## ఈ ఎస్‌యూవీలపై రూ.2.30 లక్షల డిస్కౌంట్

కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ భారత్‌లో అడుగుపెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ తన హెక్టార్, హెక్టార్ ప్లస్ ఎస్‌యూవీ మోడళ్లపై డిస్కౌంట్ ప్రకటించింది. ఇది పరిమిత కాల ఆఫర్‌గా కంపెనీ పేర్కొంది. వినియోగదారులు ఎంపిక చేసుకున్న మోడల్, వేరియంట్‌లను బట్టి ఆయా ఎస్‌యూవీలపై గరిష్ఠంగా రూ.2.30 లక్షల వరకు రాయితీలు ఉంటాయని తెలిపింది. 2019లో భారత మార్కెట్లోకి అడుపెట్టిన ఎంజీ హెక్టార్ దేశంలో మొట్టమొదటి ఇంటర్నెట్- కనెక్టెడ్ ఎస్‌యూవీగా పేరు పొందింది. డ్యూయల్ పేన్ పనోరమిక్ సన్‌రూఫ్, 14 అంగుళాల హెచ్‌డీ టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 70కి పైగా కనెక్టెడ్ కార్ ఫీచర్లు, అడ్వాన్స్‌డ్ భద్రతా సదుపాయాలు ఇందులో ఉన్నాయి. అయితే, తాజా ఆఫర్‌లో భాగంగా హెక్టార్‌లోని అన్ని వేరియంట్లపైనా గణనీయమైన తగ్గింపులను ప్రకటించారు. షార్ప్ ప్రో 1.5 పెట్రోల్ ఎంఎన్‌టీ వేరియంట్‌పై అత్యధికంగా రూ.2.14 లక్షల వరకు ఆఫర్ అందిస్తున్నారు. దీంతో, ఆఫర్ సమయంలో రూ.19 లక్షలకే (ఎక్స్‌షోరూమ్ ధర) లభిస్తుంది. స్నోస్టార్మ్, బ్లాక్‌స్టార్మ్ వేరియంట్ల ధరలపైనా భారీగా డిస్కౌంట్‌లు ప్రకటించింది. అదే సమయంలో బేస్ వేరియంట్ స్టైల్ ట్రిమ్ ధర రూ.25 వేలు పెంచడం గమనార్హం.

www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక

# ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ పవన్ షెడ్యూల్ పూర్తి



పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం ‘ఉస్తాద్ భగత్‌సింగ్’. ఈ సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే ‘హరి హర వీరమల్లు’తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు ‘ఉస్తాద్ భగత్‌సింగ్’ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. “మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే” అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. ‘గబ్బర్‌సింగ్’ తర్వాత పవన్‌కల్యాణ్ – హరీశ్‌శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ ‘ఓజీ’లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.

# రూమర్స్ వేళ.. పెళ్లి ఫొటోలు డిలీట్ చేసిన హన్సిక

నటి హన్సిక విడాకులు తీసుకోనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆ వార్తలకు మరింత బలం చేకూరుస్తూ ఆమె తన ఇన్‌స్టాలోని పెళ్లి ఫొటోలను డిలీట్ చేశారు. దీంతో మరోసారి ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. 2022 డిసెంబర్‌లో హన్సిక తన ప్రియుడు సోహైల్‌ను వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని ‘లవ్ షాదీ డ్రామా’ అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. అయితే కొన్ని రోజులుగా హన్సిక, సోహైల్ విడివిడిగా ఉంటున్నట్లు టాక్ వినిపిస్తోంది. త్వరలోనే విడాకులు తీసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ వార్తలను సోహైల్ ఖండించినప్పటికీ హన్సిక మాత్రం ఇప్పటివరకూ మౌనంగానే ఉన్నారు. తాజాగా ఆమె పెళ్లి ఫొటోలను డిలీట్ చేయడంతో మరోసారి ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఇక సినిమా విషయానికొస్తే.. ఇటీవల ‘గార్డియన్’తో పలకరించారు. ప్రస్తుతం ‘శ్రీ గాంధారి’గా ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్.కన్నన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. హన్సిక దీంట్లో హిందూ ట్రస్ట్ కమిటీ హెడ్ ఆఫీసర్‌గా కనిపించనున్నారు. శతాబ్దాల క్రితం ఓ రాజు నిర్మించిన గంధర్వ కోటలోకి ఓ ప్రాజెక్ట్ కోసం ఆఫీసర్‌గా అడుగుపెడుతుంది. మరి ఆ కోట కథేంటి? దాంట్లోని రహస్యాల్ని ఆమె ఎలా బయటపెట్టింది? అన్నది ఇందులో చూపించనున్నారు.





## ఒక నటుడిగా ఏం చేయడానికైనా
# సిద్ధం : ఎన్టీఆర్

ఒక నటుడిగా ఏం చేయడానికైనా సిద్ధమే అంటున్నారు స్టార్ హీరో ఎన్టీఆర్. హృతిక్ రోషన్‌తో కలిసి ఆయన నటించిన ‘వార్2’ ఆగస్టు 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ క్రమంలో ఎన్టీఆర్ క్రేజీ రికార్డును సొంతం చేసుకున్నారు. ప్రముఖ మ్యాగజైన్ ‘ఎస్క్వైర్ ఇండియా’ తాజా ఎడిషన్ కవర్ పేజీపై ఎన్టీఆర్ ఫొటోను ముద్రించింది. ప్రస్తుతం ఈ మ్యాగజైన్ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటో షూట్‌ను దుబాయ్‌లో నిర్వహించారు. ఈ క్రమంలో ‘ఎస్క్వైర్’ మ్యాగజైన్‌తో ఎన్టీఆర్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “నా జీవితంలో ఏది ఎలా జరగాలో నేనెప్పుడూ ప్లాన్ చేసుకోలేదు. ‘కుంగ్ ఫూ పాండా’లో ఒక కొటేషన్ నాకు చాలా ఇష్టం. ‘నిన్నటి రోజు చరిత్ర.. రేపటి రోజు తెలియని మర్మం.. కానీ, ఈ రోజు మన చేతిలో ఉన్న గొప్ప బహుమతి’ నా దృష్టి ఎప్పుడూ వర్తమానంపైనే పెడతాను. ఒక నటుడిగా నేను ఏది చేయడానికైనా సిద్ధమే. నా కుటుంబంలో సినీ వారసత్వం ఏమవుతుందో ఇప్పటికిప్పుడు నాకు తెలియదు. అందుకోసం నేనేమీ ప్లాన్ చేయలేదు. ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే కథలను చెప్పడం ద్వారా ప్రేక్షకులకు దగ్గర కావాలనుకున్నా. కానీ, అన్నింటికంటే ముఖ్యమైనది ఏంటంటే, భావోద్వేగాలు కలగలిసిన నిజాయతీపరుడిగా అందరూ నన్ను గుర్తు పెట్టుకోవాలనుకుంటున్నా’ ‘వార్2’కు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. కియారా అద్వాణీ కీలక పాత్ర పోషించింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ మూవీ రానుంది.

# పృథ్వీరాజ్‌ను వదిలి షారూఖ్‌కు అవార్డా



జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాలో ఉత్తమ నటుడి ఎంపికపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 2023లో విడుదలైన సినిమాలకు గాను ఉత్తమ నటుడుగా బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్, ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా విజయ రాఘవన్, బెస్ట్ సినిమాగా భగవంత్ కేసరి సినిమాలు అవార్డ్స్ అందుకున్నాయి. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ప్రకటించింది నేషనల్ అవార్డ్స్ జ్యూరీ. అయితే ఈ అవార్డ్స్ నేషనల్ జ్యూరీకి తలనొప్పులు తెచ్చింది. 2023 బెస్ట్ యాక్టర్ గా జావాన్ సినిమాకు గాను షారుక్‌కు ఈ అవార్డు ప్రకటించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే ఏడాదిలో మళయాళంలో పృధ్వి రాజ్ సుకుమారన్ హీరోగా ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో పృధ్వి రాజ్ నటనకు అవార్డు దక్కకపోవడంతో జ్యూరీపై విమర్శలు వచ్చాయి. వాస్తవంగా చూస్తే ఆడుజీవితంలో పృధ్వి రాజ్ సుకుమారన్ నటన అద్భుతంగా ఉ ంటుంది. బ్రతుకు తెరువుకు దుబాయ్ వెళ్లిన ఓ సామాన్యుడు అక్కడ ఎడారిలో అనుభవించిన నరకం అనుభవించే క్యారక్టర్ లో పృధ్వి రాజ్ అద్భుతంగా నటించాడు. ఇక జవాన్ సినిమాలో షారుక్ నటన గొప్పగా ఏమి ఉ ండదు.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం

### హీరోయిన్ మృణాళ్ ఠాకూర్

ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. ’ఫ్లాప్’, ’ఓవరాక్టింగ్’, ’బోర్’ అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ– మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటివల బాలీవుడ్ లో మృణాల్ నటించిన ’సన్ ఆఫ్ సర్దార్ 2’ విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి ’సన్ ఆఫ్ సర్దార్ 2’ సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉ ంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడకముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. ఇక ప్రజంట్ మృణాల్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు.



# మృణాల్ ప్రేమలో ధనుష్

## చక్కర్లు కొడుతున్న రూమర్స్



కోలీవుడ్ స్టార్ ధనుష్ ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే ఆయన ’కుబేర’ మూవీతో విజయం అందుకున్నాడు. ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇడ్లీ కడై మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. హీరోగా మాత్రమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, సింగర్‌గాను పేరు తెచ్చుకున్న ధనుష్ గురించి ఎప్పుడూ ఏదో ఒక రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ధనుష్ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల పెళ్లి జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ధనుష్ పేరుతో పలు కథనాలు వెలువడుతున్నాయి. ఒకప్పుడు మీనాతో పెళ్లి వార్తలూ అని చక్కర్లు కొట్టాయి. అయితే మీనా వాటిని ఖండిస్తూ, అలాంటి సంబంధమే లేదు, మా పాపను బాధించకండి అంటూ స్పందించారు. ఇప్పుడు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్‌తో ధనుష్ ప్రేమలో ఉ న్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుష్ ఆమెతో సన్నిహితంగా కనిపించడంపై, వీరిద్దరి మధ్య స్పెషల్ బాండ్ ఉందని టాక్ స్పీడ్‌గా స్ప్రెడ్ అయింది. చేతులు పట్టుకుని మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో లవ్ గాసిప్‌కు బలం చేకూరింది. ఇక మృణాల్ బర్త్ డే రోజే ధనుష్ ముంబైకి ప్రత్యేకంగా విమానంలో వెళ్లడం, మృణాల్, అజయ్ దేవగన్ నటించిన ’సన్ ఆఫ్ సర్దార్ 2’ స్పెషల్ స్క్రీనింగ్‌కు హాజరవ్వడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. ధనుష్, మృణాల్ గతంలోను జంటగా కనిపించారు. జూలై 3న, రచయిత్రి–నిర్మాత కనికా ధిల్లన్ ధనుష్ తదుపరి చిత్రం ’తేరే ఇష్క్ మే’ కోసం ఏర్పాటు– చేసిన పార్టీలో మృణాల్ సందడి చేసింది. కనికా షేర్ చేసిన ఫొటోల్లో మృణాల్, ధనుష్ సినిమా యూనిట్ తో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు ఫోజులివ్వడంతో అప్పటి నుండే వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారన్న రూమర్స్ గట్టిగా వినిపిస్తున్నాయి.

# విశ్వంభరలో ఆషిక రంగనా పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ ’విశ్వంభర’. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. హీరోయిన్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com